

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | మంగళవారం 06-05-2025 | సంపుటి - 23 సంచిక - 05 రూ : 4 | పేజీలు: 8

## సజ్జల కుటుంబం కబ్జాలో.. 63.72 ఎకరాలు కబ్జాలో..

- అందులో అటవీ భూమి 52.40 ఎకరాలు
- ఆక్రమించిన భూముల్లోని పండ్ల తోటలకు ప్రభుత్వ రాయితీలు
- ఎనిమిది చోట్ల అటవీ భూమి స్వాహా
- రాష్ట్ర ప్రభుత్వానికి విచారణ కమిటీ నివేదిక

2లో





## రానున్న మూడేళ్లలో రూ.2 లక్షల కోట్ల పనులు

- ప్రతి జిల్లా కేంద్రాన్నీ హైదరాబాద్‌తో అనుసంధానిస్తాం
- రూ.10 వేల కోట్లతో విజయవాడకు ఆరులేన్ల రహదారి
- కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీ
- రూ.6 వేల కోట్ల పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు

**మే 5, హైదరాబాద్:** హైదరాబాద్, ఆసిఫాబాద్, ఈటీవీ ఆదిలాబాద్: తెలంగాణ అభివృద్ధికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర రహదారి రవాణాశాఖ మంత్రి నితిన్‌గడ్కరీ తెలిపారు.

తరువాయి 2లో

## కళ'కాలం... గుర్తుండేలా

- సంప్రదాయ, సంస్కృతుల మేళవింపుతో మిస్ వరల్డ్ పోటీలకు ఏర్పాట్లు
- రాష్ట్రంలోని కళలను పరిచయం చేసేలా అధికారుల ప్రణాళిక
- అడుగడుగునా ప్రతిధ్వనించనున్న 'తెలంగాణ జరూర్ ఆనా' నినాదం

2లో



## ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్ర

- రాజకీయ పార్టీలు ఉద్యోగ సంఘాలను రెచ్చగొడుతున్నాయి
- విపక్ష నేతల చేతుల్లో పావులు కావొద్దు
- అణాపైసా అప్పు పుట్టట్లేదు... ఢిల్లీ వెళ్తే అపాయింట్‌మెంట్ ఇవ్వట్లేదు
- రహదారులు వేయడం కాదు.. గుంతలు పూడ్చేందుకూ డబ్బుల్లేవు
- ఇప్పటికే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దెబ్బతింది
- పోలీసు అవార్డుల కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టీకరణ

**మే 5, హైదరాబాద్:** రాష్ట్రంలో ప్రభుత్వాన్ని అస్థిరపరచాలని, బద్నాం చేయాలని కొన్ని రాజకీయ పార్టీలు కుట్ర పన్నుతున్నాయని, ఉద్యోగులను రెచ్చగొట్టి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని సీఎం రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. రాజకీయ పార్టీలు, విపక్ష నేతల చేతుల్లో ఉద్యోగ సంఘాలు పావులుగా మారొద్దని కోరారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉంటే సహకరించాల్సిందిపోయి సమరం చేస్తామని ఉద్యోగ సంఘాలు అంటున్నాయని, ఒకటో తేదీనే జీతాలు ఇస్తున్నందుకు

తరువాయి 2లో





## సింహాచలంలో ఆరుగురు ఇంజినీర్లపై వేటు

- గుత్తేదారు, ఇద్దరు ఇంజినీర్లపై క్రిమినల్ చర్యలు
- మరో నలుగురు ఇంజినీర్ల సస్పెన్షన్
- ఆలయ ఈవోపైనా వేటు

చందనోత్సవ వేళ గోడ కూలిన ఘటనపై త్రిసభ్య కమిటీ సిఫార్సు చర్యలకు ఆదేశించిన ప్రభుత్వం

**మే 5, అమరావతి:** అమరావతి: చందనోత్సవ వేళ సింహాచలం ఆలయంలో గోడ కూలి, ఏడుగురు భక్తులు మృతి చెందిన ఘటనలో ఆరుగురు ఇంజినీర్లపై ప్రభుత్వం వేటు వేసింది. వీరిలో ఇద్దరు ఇంజినీర్లపై క్రిమినల్ చర్యలకు ఆదేశించింది. గోడ నిర్మించాలని ఆదేశించిన ఆలయ ఈవోను సస్పెండ్ చేసింది. గుత్తేదారుపై క్రిమినల్ చర్యలకు ఆదేశించడంతోపాటు, బ్లాక్‌లిస్ట్‌లో పెట్టింది. గత నెల 30న జరిగిన ఈ ఘటనపై పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి సురేష్‌కుమార్, ఐజీ ఆకే రవికృష్ణ, జలవనరులశాఖ ఈఎన్‌సీ వెంకటేశ్వరరావులతో కూడిన త్రిసభ్య కమిటీ విచారణ జరిపి, ప్రాథమిక నివేదికను ప్రభుత్వానికి

తరువాయి 2లో

## అటునుంచి కొడితే పాక్‌కు షాక్!

**మే 5, ఢిల్లీ :** పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్‌పై దాడి చేయడానికి ఉన్న మార్గాలను భారత్ అన్వేషిస్తోంది. దాడి ఎప్పుడు, ఎలా, ఎక్కడ చేయాలన్నదానిపై ప్రభుత్వం సైనికదళాలకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చింది. అయితే భారత్ వెంబడి ఉన్న నియంత్రణ రేఖ, అంతర్జాతీయ సరిహద్దుల్లో పాకిస్థాన్ భారీగా సైనిక బలగాలు, గగనతల రక్షణ వ్యవస్థలు సహా అనేక ఆయుధాలను మోహరించింది. ఈ నేపథ్యంలో భారత దళాలకు పెద్దగా నష్టం జరగకుండా పొరుగు దేశాన్ని శిక్షించడం ఎలా అన్నది కీలకంగా మారింది. మధ్య ఆసియాలో పెద్దగా ప్రాచుర్యంలోలేని ఒక వైమానిక స్థావరం ఈ విషయంలో మనకు అక్కరకొస్తుందని సైనిక వ్యూహకర్తలు చెబుతున్నారు. పాక్‌పై నిఘాకు, అవసరమైతే వైమానిక దాడికి ఇది

తరువాయి 2లో



## హైకోర్టులు తీర్పులు రిజర్వులో ఉంచేస్తున్నాయి



- ఇది ఆందోళనకరమైన పరిణామం
- దీన్ని అనుమతించచబోం
- సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం

2లో

# ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

సమరం చేస్తారా అని ఆయన ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని పోలీసు కమాండ్ కంట్రోల్ కేంద్రంలో పోలీసు శాఖ సోమవారం ఓ టీవీ ఛానెల్‌తో కలిసి నిర్వహించిన అవార్డుల కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ఉద్యోగ సంఘాలు ప్రభుత్వానికి ఇచ్చిన అల్టిమేటంపై ఘాటుగా స్పందించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ఆదాయం, అప్పులు, వడ్డీలపై సుదీర్ఘ వివరణ ఇచ్చారు. ఉద్యోగులు, ప్రజల కోసమే తాను పనిచేస్తున్నానని.. ఉద్యోగులు, తాను వేర్వేరు కాదని, అందరం కలిసి తెలంగాణను అభివృద్ధి పథంలో తీసుకెళ్దామని పిలుపునిచ్చారు. 9 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు.. పేదలు, ప్రజల సేవలో ఉండాలన్నారు. నేతల చేతుల్లో పావులుగా మారి.. ప్రజల గుండెల్లో చురకత్తులు గుచ్చొద్దని కోరారు. "ఉద్యోగుల కోర్కెలు తీర్చేందుకు మేం సిద్ధంగా లేం. ఉన్నదాంతోనే సర్దుకోవాలి. ప్రతినెలా వచ్చే రూ.18,500 కోట్ల ఆదాయం ఉద్యోగుల జీతాలు, గుత్తేదారుల బిల్లులు, సంక్షేమ పథకాల అమలుకు సరిపోతోంది. అదనపు ఆదాయం రావాలంటే ఖర్చులు తగ్గించుకోవడం, కొత్తగా పన్నులు వేయడం ఒక్కటే మార్గం. సంక్షేమ పథకాలు ఆపటం లేదా బియ్యం, ఉప్పు, పప్పు వంటి నిత్యావసరాల ధరలు పెంచడం చేయాలి. ఈ రెండిట్లో ఏం చేయాలో చెప్పాలి. కావాలంటే 10 లక్షల మంది ప్రజలతో నేనే సమావేశం ఏర్పాటు చేస్తాను. అక్కడే దీనిపై చర్చిద్దాం.

*** ప్రభుత్వంపై సమరంతో శాంతిభద్రతల సమస్యలు**

ప్రభుత్వంపై సమరం చేస్తే శాంతిభద్రతల సమస్యలు వస్తాయి. రాష్ట్రం పరువు బజారున పడుతుంది. కుటుంబ పెద్దగా చెబుతున్నా. ఉద్యోగ సంఘాల నాయకులు పునరాలోచించుకోవాలి. రాష్ట్రం ఆర్థికంగా అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న తరుణంలో ప్రభుత్వంపై సమరం చేస్తామనడం ఎంతవరకు సమంజసం? రాష్ట్ర జనాభాలో 3 శాతం మంది ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు మిగతా 97 శాతం ప్రజలపై యుద్ధం ప్రకటించడం విస్మయం కలిగిస్తోంది. ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు కలిస్తేనే ప్రభుత్వం. అందులో భాగస్వాములుగా ఉన్న మీరు ఎవరిపై యుద్ధం చేస్తారు? సమస్యలుంటే చర్చలు జరపడానికి సిద్ధంగా ఉన్నాం.

*** అప్పులు, వడ్డీలకే రూ.7 వేల కోట్ల చెల్లింపులు**

తెలంగాణ రాకముందు అప్పులు, వడ్డీలకు ప్రభుత్వం ఏటా రూ.6 వేల కోట్ల నుంచి రూ.7 వేల కోట్లు చెల్లించేది. ప్రస్తుతం అసలు, వడ్డీలు కలిపి నెలకే రూ.7 వేల కోట్లు చెల్లించాల్సి వస్తోందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. మా ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత ఇప్పటివరకూ రూ.1.58 లక్షల కోట్ల అప్పులు చేశాం. ఇందులో రూ.1.52 లక్షల కోట్లు గత ప్రభుత్వం చేసిన అప్పులు, వడ్డీలు చెల్లించడానికే సరిపోయింది. గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను నిలిపివేయకపోగా.. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం మొదలు అనేక కొత్త పథకాలను ప్రవేశపెట్టాం. అయినప్పటికీ ఉద్యోగులకు ప్రతి నెలా 1నే జీతాలు ఇస్తున్నాం. అంతకుముందు పదేళ్లలో ఏ ఒక్క నెలలోనూ 1న జీతాలు పడలేదన్న విషయం గుర్తుంచుకోవాలి. మేం అధికారంలోకి వచ్చాక రూ.20,617 కోట్ల రైతు రుణమాఫీ చేశాం. గత ముఖ్యమంత్రి కేసీఆర్ పెండింగ్‌లో పెట్టిన రూ.7,625 కోట్ల రైతుబంధు పథకం బకాయిలు చెల్లించాం. మా ప్రభుత్వం వచ్చాక రైతులకు రూ.30 వేల కోట్లు చెల్లించాం. కేసీఆర్ ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్మాణమంటూ 11% వడ్డీకి రూ.50 వేల కోట్లు అప్పులు తెచ్చింది. ఇప్పుడు అవి గుదిబండగా మారాయి. దీంతోపాటు రూ.7,500 కోట్లకు ఔటర్ రింగు రోడ్డే కాదు, ఖరీదైన భూములు కూడా అమ్మేశారు.

**ఫాంహౌస్‌లో పడుకొని విమర్శలు**

అడ్డగోలుగా అప్పులు చేసినాయన ఫాంహౌస్‌లో పడుకున్నారు. మూడు నెలలకోసారి బయటకొచ్చి 'ఇది విఫలమైంది, అది విఫలమైంద'ని విమర్శిస్తున్నారు. ఆదాయం రూ.3 లక్షల కోట్లుందని ఆయన చెబితే ఏదోవిధంగా చక్కబెట్టొచ్చనుకున్నాను. అప్పులు రూ.8.5 లక్షల కోట్లున్నాయని అధికారంలోకి వచ్చాక తెలిసింది. దీన్నుంచి గట్టెక్కేందుకు ప్రయత్నిస్తున్నాం. ఇలాంటి పరిస్థితుల్లో సమయస్ఫూర్తితో వ్యవహరించాలి.

*** బడ్జెట్ పద్మనాభం లెక్కలు తప్పట్లే**

ప్రభుత్వ పథకాలను అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వ ఉద్యోగులపై లేదా? మీకు ఉద్యోగం ఇచ్చినవాళ్లే మాకు అవకాశం ఇచ్చారు. ప్రతి నెలా ప్రభుత్వం నడిపేందుకు రూ.22,500 కోట్లు అవసరం కాగా.. రూ.18,500 కోట్ల ఆదాయం వస్తోంది. ఇంతకంటే ఒక్క రూపాయి కూడా ఎక్కువగా వచ్చే పరిస్థితి లేదు. జీతాలు, పింఛన్లు, సంక్షేమ పథకాలకు రూ.4 వేల కోట్లు అప్పులు చేయాల్సి వస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో నేను ఏం చేయాలో, దేన్ని ఆపాలో ఉద్యోగ సంఘాల నాయకులు చెప్పాలి. ముఖ్యమంత్రి హోదాలో ప్రత్యేక విమానంలో ప్రయాణించే అవకాశం ఉంది. అయినప్పటికీ విదేశాలకు వెళ్లినప్పుడూ ఎకానమీ క్లాస్‌లోనే ప్రయాణిస్తున్నాను. రూపాయి రూపాయి లెక్కలు వేస్తూ రాష్ట్రాన్ని నడిపిస్తున్నాను. అధికారం చేపట్టిన తర్వాత ఒక్క గంట కూడా సెలవు తీసుకోకుండా పనిచేస్తున్నాను. కుటుంబ ఖర్చులకు లెక్కలు వేసినట్టే.. మేం కూడా ఉన్నదాంట్లో సర్దుబాటు చేసేందుకు బడ్జెట్ పద్మనాభం లెక్కలు వేయాల్సి వస్తోంది. నన్ను కోసినా ఇంతకు మించి ఇవ్వలేం.

*** డ్రగ్స్, సైబర్ నేరాల నియంత్రణకు సాంకేతికత**

డ్రగ్స్, సైబర్ నేరాల కట్టడిలో సాంకేతికతను అందిపుచ్చుకోవాలి. శాంతిభద్రతల నిర్వహణలో తెలంగాణ పోలీస్ ప్రథమ స్థానంలో ఉంది. సురక్షితమని భావించిన ప్రాంతంలోనే వ్యాపారవేత్తలు పెట్టుబడులు పెడతారు. రూ.2.28 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకట్టుకున్నామంటే ఇక్కడ శాంతిభద్రతలు ఎంత భద్రంగా ఉన్నాయో అర్థం చేసుకోవాలి. అమెజాన్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థ రూ.60 వేల కోట్ల పెట్టుబడి పెట్టింది. ఐపీఎస్ అధికారులు మరణిస్తే బాధిత కుటుంబానికి రూ.2 కోట్లు, డీఎస్పీ స్థాయిలోని వారికి రూ.కోటిన్నర నష్టపరిహారం ఇవ్వాలని, మిగతా సిబ్బందికి ప్రాణనష్టం, అంగవైకల్యం సంభవిస్తే మానవత్వంతో ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పోలీసు పిల్లల భవిష్యత్ కోసం యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ఏర్పాటు చేశాం" అని రేవంత్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో సీఎస్ రామకృష్ణారావు, డీజీపీ జితేందర్, నగర కొత్వాల్ సీవీ ఆనంద్, ఐజీ రమేశ్‌రెడ్డి, సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాశ్ మహంతి, పోలీసు ఉన్నతాధికారులు రవి గుప్తా, నాగిరెడ్డి, హైడ్రా కమిషనర్ రంగనాథ్, శిఖా గోయెల్, సందీప్ శాండిల్య, టీవీ ఛానల్ ప్రతినిధులు ఉమేశ్ శరాఫ్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

*** గత ప్రభుత్వం రూ.వేల కోట్ల బకాయిలు పెట్టింది**

ప్రభుత్వ ఉద్యోగులకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాల్సి వస్తుందనే ఉద్దేశంతో గత ప్రభుత్వం పదవీ విరమణ వయసును 58 నుంచి 61 ఏళ్లకు పెంచింది. విశ్రాంత ఉద్యోగులకు చెల్లించాల్సిన రూ.8,500 కోట్లు, నెలనెలా జీతాలు, పింఛన్లు, బెనిఫిట్స్, దాచుకున్న సొమ్ము రూ.9 వేల కోట్లను గత ప్రభుత్వం బకాయి పెట్టింది.

# రానున్న మూడేళ్లలో రూ.2 లక్షల కోట్ల పనులు

(మొదటిపేజీ తరువాయి)

హైదరాబాద్‌లోని అంబర్‌పేటలో, బీహెచ్ఈఎల్ వద్ద పైవంతెనలను గడ్కరీ సోమవారం ప్రారంభించారు. హైదరాబాద్‌లో రూ.2,169 కోట్లు, కుమురం భీం జిల్లాలో రూ.3900 కోట్ల అభివృద్ధి పనులకు సంబంధించి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. కుమురం భీం జిల్లా రెబ్బెన మండలంలో కాగజ్‌నగర్ క్రాస్‌రోడ్డు వద్ద, అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభల్లో గడ్కరీ మాట్లాడారు. ఆయా కార్యక్రమాల్లో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, సీతక్క, ఎంపీలు, ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గడ్కరీ మాట్లాడుతూ.. "రాష్ట్ర అభివృద్ధికి ప్రధాని మోదీ నేతృత్వంలో రూ.1.25 లక్షల కోట్లు వెచ్చించాం. వచ్చే మూడేళ్లలో రూ.2 లక్షల కోట్లు ఖర్చు చేసి రాష్ట్ర ముఖచిత్రాన్నే మార్చుతాం. నాలుగు వరుసల రోడ్లతో ప్రతి జిల్లా కేంద్రాన్ని హైదరాబాద్‌తో అనుసంధానిస్తాం. దేశానికి స్మార్ట్ నగరాలే కాదు, స్మార్ట్ విలేజ్‌లూ అవసరం. ఐటీ రంగానికి, ఉద్యోగవకాశాలకు హైదరాబాద్ కీలకం. హెలికాప్టర్‌లో వచ్చేటప్పుడు హైదరాబాద్ ఇరుకుగా అనిపించింది. మలేసియా సాంకేతికత, డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్‌లతో స్థలం అవసరం తగ్గుతుంది. స్పెయిన్ తరహా విధానాలను అనుసరించాలి. ప్రయాణించేటప్పుడే వాహనాలు ఛార్జింగ్ అవ్వాలి. డీజిల్, పెట్రోలు వినియోగం తగ్గాలి.

*** 10 నెలల్లో ఉప్పల్ పైవంతెన..**

ఎలాంటి పరిస్థితులున్నా 8 10 నెలల్లో ఉప్పల్ పైవంతెనను పూర్తి చేస్తాం. పైవంతెనలను గడువుకంటే ముందు పూర్తి చేస్తే రూ.1 లక్ష బహుమతి, ఆలస్యమైతే రూ.1.5 లక్ష జరిమానా విధించే విధానాన్ని తీసుకొచ్చాం.

**ప్రాజెక్టుల్లో పూడిక తీయాలి..**

తెలంగాణ సీఎం, మంత్రులను ఒక్కటే కోరుతున్నా.. ప్రాజెక్టుల్లో పూడికతీద్దాం, రైతులు బంగారు పంటలు పండించేలా చూద్దాం. ఇందుకు తగిన ప్రణాళికలను తయారు చేయండి. జగిత్యాలకరీంనగర్ 59 కి.మీ. నాలుగు వరుసల రహదారిని మూడు నెలల్లో పూర్తి చేస్తాం. ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, హనుమకొండ, వరంగల్, ఖమ్మం రహదారి, నాగ్‌పుర్‌విజయవాడ రోడ్డు విస్తరణ పనులను వేగంగా పూర్తి చేస్తాం. తెలంగాణ మహారాష్ట్రలను అనుసంధానించేలా ఆర్మూర్, మంచిర్యాల, తాండూరు, కౌటాల, ఆళ్లపల్లి రోడ్డుకు నిధులు కేటాయిస్తాం. హైదరాబాద్‌నాగ్‌పుర్ మార్గంలో ట్రాఫిక్ పెరుగుతున్నందున ఆరు వరుసలుగా విస్తరిస్తాం" అని గడ్కరీ హామీ ఇచ్చారు.

*** రాష్ట్రం భూసేకరణ పూర్తి చేయాలి: కిషన్‌రెడ్డి**

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.."65 ఏళ్ల పాలనలో తెలంగాణలో నిర్మాణమైన జాతీయ రహదారుల పొడవు 2,500 కి.మీ. ఈ పదేళ్లలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ 2,600 కి.మీ రోడ్లను రాష్ట్రంలో నిర్మించారు. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అంబర్‌పేట్ పైవంతెనకు కేంద్రం నుంచి ఆమోదం తీసుకొచ్చా. శ్మశానాల వద్ద భూసేకరణకు ఇబ్బందులొచ్చాయి. చివరకు వంతెన డిజైనులో మార్పులు చేశాం. స్టీలు దిమ్మెలతో వంతెనను పూర్తి చేశాం. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి.. ఆరు ప్రాంతాల్లో నిలిచిన భూసేకరణను పూర్తి చేసి, సర్వీసు రోడ్లను అందుబాటులోకి తేవాలి. ఆదిలాబాద్‌లో డిఫెన్స్ అకాడమీని త్వరలో ప్రారంభించనున్నాం" అని తెలిపారు. పార్టీలకు అతీతంగా నితిన్ గడ్కరీ రహదారి ప్రాజెక్టులను ఆమోదిస్తున్నారని.. ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగాన్ని కూడా కేంద్రమే చేపట్టాలని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరారు.

# సింహాచలంలో ఆరుగురు ఇంజినీర్లపై వేటు

(మొదటిపేజీ తరువాయి)

సోమవారం అందజేసింది. గోడ నిర్మాణంలో లోపాలు, దీనికి బాధ్యులను పేర్కొంటూ చర్యలకు సిఫార్సు చేసింది. గోడ నిర్మాణానికి ఎటువంటి ప్లాన్, డిజైన్ లేకపోవడం మొదలుకొని నాణ్యత పాటించకపోవడం, ఇంజినీర్లు, అధికారుల పర్యవేక్షణ లేకపోవడమే ప్రమాదానికి దారితీశాయని కమిటీ స్పష్టం చేసింది. ఆ నివేదికలో వివరాలివి..

**గోడకు డిజైన్, డ్రాయింగ్స్ లేవు**

- * గోడ నిర్మాణానికి డిజైన్ లేదు. డ్రాయింగ్, ప్లాన్ రూపొందించలేదు.
- * ఆ గోడ అధిక బరువును తట్టుకునేలా లేదు.
- * పునాది లేదు. నేరుగా నేలపైనే గోడ నిర్మించేశారు.
- * నాణ్యతలేని ఫాల్‌జి ఇటుకలు వాడారు. నిర్మాణానికి వాడిన సిమెంట్‌లోనూ నాణ్యత లేదు.
- * గోడకు సరిగా క్యూరింగ్ చేయలేదు.
- * సమీపంలో తవ్విన మట్టి, శిథిలాలను గోడ వెనుక పోయడంతో.. దానిపై ఒత్తిడి పెరిగింది.

**నీటిని అడ్డుకునేలా గోడ నిర్మాణం**

- * సహజంగా వచ్చే వర్షపు నీటి ప్రవాహానికి గోడ అడ్డుగా నిలిచింది.
- * నీరు పోయేందుకు డ్రైనేజీ, గోడపై ఒత్తిడి తగ్గించి నీరు బయటకు వెళ్లేలా వీప్ హోల్స్ ఏర్పాటు చేయలేదు.
- * అసలే బలంగా లేని గోడకు.. ఉత్సవం కోసం వేసిన తాత్కాలిక షెడ్ల సపోర్టు బీమ్‌లను దన్నుగా ఏర్పాటు చేశారు. దీనికితోడు భారీ గాలి, వర్షంతో గోడపై ఒత్తిడి మరింత పెరిగింది.

**తీవ్రనిర్లక్ష్యం చూపిన అధికారులు**

- * గోడ నిర్మాణం విషయంలో అధికారులు, ఇంజినీర్లంతా తీవ్ర నిర్లక్ష్యం చూపారు.
- * డిజైన్ రూపొందించకపోవడమే కాకుండా, గోడ నిర్మాణానికి అంచనా, ఇతర రికార్డులేవీ నిర్వహించలేదు.
- * ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ, దేవాదాయశాఖ ఇంజినీర్లు గోడ నిర్మాణాన్ని పర్యవేక్షించడంలో విఫలమయ్యారు.
- * అధికారిక అనుమతి, నాణ్యత పరిశీలన లేకుండానే గోడ కట్టేశారు.
- * భక్తులు వెళ్లే మార్గంలో నిర్మించిన గోడకు ఇంజినీరింగ్ ప్రాథమిక సూత్రాలేవీ పాటించలేదు.
- * ఆలయ ఈవో, ఈఈ తమ విధుల్లో విఫలమయ్యారు. నెపమంతా పర్యాటకశాఖపై నెట్టేశారు.
- * గోడ వివరాలు, కొలమానాలేవీ రిజిస్టర్‌లో నమోదు చేయలేదని పర్యాటక సంస్థ ఇంజినీర్లు అంగీకరించారు. ఎం బుక్ వంటి రికార్డులు కూడా వారు నిర్వహించలేదు.

**వేటుపడింది వీరిపైనే..**

- * సింహాచలం ఆలయ ఈవో కె.సుబ్బారావు: గోడ నిర్మాణానికి ఆదేశించారు. ఇంజినీర్ల పర్యవేక్షణ లేకపోయినా, భద్రతాపరమైన చర్యలు తీసుకోకున్నా.. పట్టించుకోలేదు.
- * ఆలయ ఈఈ డి.జి.శ్రీనివాసరాజు: ప్రమాదకరమని తెలిసినా గోడ నిర్మాణానికి పట్టుబట్టారు. నిర్మాణాన్ని పర్యవేక్షించడంలో విఫలమయ్యారు. ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చూపారు.
- * పర్యాటక సంస్థ ఈఈ కె.రమణ: ప్రసాద్ పథకం కింద డిజైన్లకు ఆయనదే బాధ్యత. లోపాలు తెలిసినా తెలియనట్లు నటించారు. ఉద్దేశపూర్వక నిర్లక్ష్యం చూపారు.
- * ఆలయ డీఈ కేవీఎస్ఎస్ మూర్తి: నిర్మాణం జరుగుతున్నప్పుడు తనిఖీ చేయడంలో, నాణ్యత పరిశీలన, లోపాలు సరిచేయడంలో విఫలమయ్యారు.

# 'కళ'కాలం గుర్తుండేలా

హైదరాబాద్: మిస్ వరల్డ్ పోటీలకు హైదరాబాద్ సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. పోటీల్లో పాల్గొనేందుకు అందాలభామలు భాగ్యనగరానికి చేరుకుంటున్నారు. వందకు పైగా దేశాల నుంచి వచ్చే సుందరీమణులకు స్వాగతం పలికేందుకు శంషాబాద్ విమానాశ్రయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. విదేశీ ప్రతినిధులు, అతిథులను తెలంగాణ సంప్రదాయ పద్ధతిలో ఆహ్వానిస్తున్నారు. అతిథులకు ఇక్కడి సంస్కృతి, సంప్రదాయాలు కళ్లకు కట్టేలా నగరాన్ని అలంకరిస్తున్నారు. రాష్ట్రంలోని ప్రత్యేక కళలను పరిచయం చేసేందుకు అధికారులు ప్రణాళిక రచిస్తున్నారు. పోర్చుగల్‌కు చెందిన మారియా అమెలియా ఆంటోనియో, ఘనా నుంచి జుట్టా అమా పోకువా అడ్డో, ఐర్లాండ్‌కు చెందిన జాస్మిన్ జెర్హార్డ్, నమీబియాకు చెందిన సెల్మా కార్లిసియా కెమని సోమవారం హైదరాబాద్ వచ్చారు. ఇప్పటికే మిస్ కెనడా, మిస్ సౌత్ ఆఫ్రికా, మిస్ బ్రెజిల్‌తో మిస్‌వరల్డ్ నిర్వాహకులు చేరుకున్నారు. మంగళ, బుధవారం నాటికి అతిథులు దాదాపు అంతా చేరుకోనున్నారు. వీరికి స్వాగతం పలికేందుకు ఎయిర్ పోర్ట్‌లో ప్రత్యేక లాంజ్‌లను, రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలు, ప్రత్యేక చిహ్నాలతో స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. 'తెలంగాణ జరూర్ ఆనా' నినాదం ప్రతిచోటా కనిపించేలా, వినిపించేలా చేస్తున్నారు. పోచంపల్లికి భామలు.. ప్రఖ్యాత చేనేత గ్రామం పోచంపల్లిని ప్రపంచ సుందరి పోటీల్లో పాల్గొనే అందాలభామలు సందర్శించనున్నారు. ఇక్కడి సంక్లిష్టమైన ఇక్కత్ నేత పద్ధతులకు అంతర్జాతీయంగా ప్రశంసలు దక్కాయి. పోచంపల్లిని ఇప్పటికే యునెస్కో ప్రపంచంలోని ఉత్తమ పర్యాటక గ్రామంగా గుర్తించింది.

# సజ్జల కుటుంబం కబ్జాలో.. 63.72 ఎకరాలు

గత వైకాపా ప్రభుత్వ హయాంలో సకల శాఖల మంత్రిగా సర్వాధికారాలు చలాయించిన ఆ పార్టీ నాయకుడు సజ్జల రామకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులు వైఎస్సార్ జిల్లాలోని సీకే దిన్నె గ్రామ పరిధిలో 52.40 ఎకరాల అటవీ భూమి సహా మొత్తం 63.72 ఎకరాల్ని కబ్జా చేసినట్టు విచారణ కమిటీ నిగ్గుతేల్చింది. ఇందులో గతంలో పాయవంక రిజర్వాయర్ కోసం ప్రభుత్వం సేకరించిన 8.05 ఎకరాల భూమి, కొంత ఎసైన్డ్ భూమి ఉన్నట్లు గుర్తించింది. సజ్జల కుటుంబ సభ్యులు సీకే దిన్నె గ్రామ పరిధిలోని సర్వే నం.1629లో 52.40 ఎకరాల అటవీ భూముల్ని ఎనిమిది చోట్ల ఆక్రమించి, అడవిని ధ్వంసం చేసి, పర్యావరణానికి తీవ్ర నష్టం కలగజేశారని తెలిపింది. ఆక్రమించిన భూమి చుట్టూ ఫెన్సింగ్ వేయడంతో పాటు, ఎలాంటి అనుమతులూ లేకుండా వాటిలో ఒక అతిథి గృహం, నాలుగు గదులు నిర్మించారని పేర్కొంది. ఆ భూముల్లో పండ్ల తోటలు పెంచుతున్నట్టు తెలిపింది. అటవీ భూముల్లో అక్రమంగా సాగు చేయడమే కాకుండా, అక్కడ డ్రిప్ ఇరిగేషన్, మామిడికాయల నిల్వ కోసం 'హార్వెస్టింగ్ రూం' నిర్మాణానికి వివిధ ప్రభుత్వ పథకాల కింద రాయితీ కూడా పొందినట్లు తెలిపింది. సజ్జల కుటుంబ సభ్యుల భూ ఆక్రమణలపై కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ మురళీకృష్ణ, బద్వేల్ సబ్ డివిజినల్ అటవీ అధికారి స్వామి వివేకానందలతో కూడిన త్రిసభ్య కమిటీ ఇచ్చిన తుది నివేదికను జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి ఇటీవల సమర్పించింది. సజ్జల కుటుంబ సభ్యులు ఆ భూముల్ని ఎప్పుడెప్పుడు, ఎలా ఆక్రమించారో సవివరంగా ఆ నివేదికలో పొందుపరిచింది. సజ్జల రామకృష్ణారెడ్డి అన్న కుమారుడు సజ్జల సందీప్‌రెడ్డితో పాటు మరో ఆరుగురు కుటుంబ సభ్యుల్ని ఆక్రమణదారులుగా కమిటీ నిగ్గుతేల్చింది. వారి ఆక్రమణలోని భూముల్ని తక్షణం స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వానికి సిఫారసు చేసింది.

**హైకోర్టుకే అబద్ధం..**

- * కడప నుంచి 7 కి.మీ. దూరంలో సజ్జల కుటుంబానికి విశాలమైన ఎస్టేట్ ఉంది. స్థానికంగా దాన్ని సజ్జల ఎస్టేట్ అని పిలుస్తారు. సజ్జల కుటుంబ సభ్యులు ప్రభుత్వ భూముల్ని కబ్జా చేశారంటూ 2022 నుంచి రాజా నాయక్ అనే స్థానికుడు 50 సార్లకు పైగా ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు.
- * ఎన్ని ఫిర్యాదులు వచ్చినా గత వైకాపా ప్రభుత్వ హయాంలో అధికారులు ఆ ఎస్టేట్‌పై కన్నెత్తి చూడలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక విచారణకు ఆదేశించింది.
- * దానిపై సజ్జల సందీప్‌రెడ్డి తదితరులు హైకోర్టును ఆశ్రయించారు. సీకే దిన్నె గ్రామ పరిధిలో తమకు 184.32 ఎకరాలున్నాయని, వాటిలో పండ్ల తోటలు సాగు చేస్తున్నామని, ఆ భూముల్లోకి ప్రభుత్వం బలవంతంగా ప్రవేశించి నష్టం చేయకుండా ఆదేశాలివ్వాలని కోర్టుకు విజ్ఞప్తి చేశారు.
- * యథాతథ స్థితిని కొనసాగించాలని ఆదేశిస్తూ.. ప్రభుత్వం విచారణ చేసుకోవచ్చని కోర్టు తెలిపింది. దాని ఆధారంగా వైఎస్సార్ జిల్లా కలెక్టర్ నియమించిన కమిటీ, ఫిబ్రవరి, మార్చి నెలల్లో సర్వే నిర్వహించింది.
- * సజ్జల కుటుంబం తరపున సందీప్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి హాజరయ్యారు. 1599 నుంచి 1627, 1629 సర్వే నంబర్లలోని మొత్తం 201.17 ఎకరాలు సజ్జల కుటుంబం అధీనంలో ఉన్నట్లు కమిటీ గుర్తించింది.
- * వాస్తవంగా సజ్జల కుటుంబ పట్టాభూమి 137.45 ఎకరాలేనని నిగ్గుతేల్చింది. మిగతా 63.72 ఎకరాల్ని కబ్జా చేసినట్లు గుర్తించింది.

2014లోనే సజ్జలకు నోటీసులు

# అటునుంచి కొడితే పాక్‌కు షాక్!

(మొదటిపేజీ తరువాయి)

ఉపయోగపడుతుందని పేర్కొంటున్నారు. అక్కడ పాక్ బలహీనం పాక్ ఎప్పుడూ భారత్‌తో ఉన్న తూర్పు సరిహద్దులను బలోపేతం చేయడంపై దృష్టిపెడుతుంటుంది. అఫ్గానిస్థాన్ వెంబడి ఉన్న పశ్చిమ, ఉత్తర సరిహద్దులను పెద్దగా పట్టించుకోదు. ఉపరితలం నుంచి గగనతలంలోని లక్ష్యాలను ఛేదించగల అస్త్రాల్లో అత్యుత్తమమైనవాటిని భారత్‌తో ఉన్న సరిహద్దుల వెంబడే పాక్ మోహరించింది. అందువల్లే 2011లో అంతర్జాతీయ ఉగ్రవాది ఒసామా బిన్ లాడెన్‌ను హతమార్చడానికి అమెరికా దళాలు రెండోవైపు నుంచి సునాయాసంగా పాక్‌లోని అబోటాబాద్‌కు చేరుకున్నాయి. ఇది జరిగి 14 ఏళ్లు గడిచినా.. ఇప్పటికీ అదే పరిస్థితి. దీన్ని భారత్ సొమ్ము చేసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.

# హైకోర్టులు తీర్పులు రిజర్వులో ఉంచేస్తున్నాయి

దిల్లీ: తీర్పులు వెల్లడించడంలో వివిధ హైకోర్టుల్లో జరుగుతున్న జాప్యంపై సోమవారం సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. 2025 జనవరి 31కి ముందు జడ్జిమెంట్ రిజర్వులో ఉంచి.. ఇంకా తుది తీర్పు వెల్లడించని కేసుల వివరాలను 4 వారాల్లోపు సమర్పించాలని అన్ని హైకోర్టులను ఆదేశించింది. తమ కేసులో జడ్జిమెంట్ రిజర్వు చేసి 2,3 ఏళ్లవుతున్నా తుది తీర్పును ఇంకా ప్రకటించలేదని నలుగురు దోషులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌ల ధర్మాసనం ఈ ఉత్తర్వులను జారీ చేసింది. "నిజాయతీగా చెబుతున్నాం. ఇది ఆందోళనకరమైన విషయం. ఎందుకిలా జరుగుతుందో.. పరిస్థితులేంటో మాకు తెలియవు. కానీ వీటిపై కచ్చితంగా మార్గదర్శకాలు జారీ చేస్తాం. ఇలా జరగడాన్ని మాత్రం అనుమతించబోం" అని ధర్మాసనం పేర్కొంది.

# సమాజ స్థాపనకు కృషిచేసిన సిద్ధాంతకర్త మార్క్స్

* **ఘనంగా సోషలిస్ట్ కమ్యూనిస్టు పితామహుడు కార్ల్ మార్క్స**
* **ఎండి జహంగీర్**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: సమాజ స్థాపన కోసం కృషి చేసిన సిద్ధాంతకర్త సోషలిస్ట్ కమ్యూనిస్టు పితామహుడు కార్ల్ మార్క్స అని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం కందాల రంగారెడ్డి స్మారక భవనంలో సిపిఎం మున్సిపల్ కమిటీ కార్యదర్శి గోశిక కరుణాకర్ అధ్యక్షతన కార్ల్ మార్క్స జయంతి సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎండి జహంగీర్ హాజరయ్యారు. కార్ల్ మార్క్స చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎండి జహంగీర్ మాట్లాడుతూ జర్మన్ శాస్త్రవేత్తగా, తత్వవేత్త, ఆర్థికవేత్త, సామాజికవేత్త, పాత్రికేయుడు, సోషలిస్టు విప్లవకారుడుగా బహుముఖ ప్రజ్ఞాశాలి కార్ల్ మార్క్స అన్నారు. సమాజం, ఆర్థిక శాస్త్రం, ప్రధానంగా రాజకీయాల వంటి వాటిపై మార్క్స సిద్ధాంతాలను కలగలిపి మార్క్సిజం పిలుస్తున్నారన్నారు. మార్క్సిజం ప్రధానంగా మానవ సమాజాలు వర్గ పోరాటాల ద్వారా అభివృద్ధి చెందాయన్నారు. మార్క్స కార్మిక వర్గ పెట్టుబడిదారీ వ్యవస్థలను కూలదోసి సామాజిక ఆర్థిక విముక్తి తీసుకువచ్చేందుకు సంఘటితంగా ఆచరణ కోసం పోరాడాలన్నారు. కార్ల్ మార్క్స ఆశయ సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నరసింహ, బూర్గు కృష్ణారెడ్డి, రాగిరి కిష్టయ్య, నాయకులు బొజ్జ బాలయ్య, బత్తుల దాసు, ఉష్కాగుల శ్రీను, బొడ్డు రాజు, బోయ యాదయ్య, ఎండి. ఖయ్యూం, భావండ్లపల్లి స్వామి, కందగట్ల ఆనంద్, కల్వకుంట్ల శివ, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, బత్తుల రమేష్, బత్తుల జయమ్మ, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలను పరిష్కరించని యెడల ప్రజా ఉద్యమం చేపడతాం

* **స్వచ్ఛభారత్ అభియాన్ ఫౌండర్ చైర్మన్ మాధవరం కాంతారావు**



కూకట్పల్లి, (ప్రజాస్ఫూర్తి) : సమస్యలపై తగిన చర్యలు తీసుకొని యెడల కాలనీవాసులతో కలిసి ప్రజా ఉద్యమం చేపడతామనీ స్వచ్ఛభారత్ అభియాన్ ఫౌండర్ చైర్మన్ మాధవరం కాంతారావు అన్నారు. రోడ్ నెంబర్ వన్ నుంచి జేఎన్టీయూ వరకు ఉన్న వాణిజ్య సముదాయాల ఏర్పాటుతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతుండడంతో సోమవారం ఆయన పాల్గొన్నారు. అనంతరం జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్ నెంబర్ వన్ నుండి జేఎన్టీయూ వరకు ఉన్న అనధికృత వాణిజ్య సముదాయాల వల్ల స్థానికుల రాకపోకలకు , పార్కింగ్ కి ఇబ్బంది కలుగుతుందన్నారు. ఆ వాణిజ్య సముదాయాల్లో రద్దీని ఆసరాగా చేసుకొని మహిళలను వేధిస్తున్న పోకిరీలు. అత్యవసర సమయాల్లో గమ్యస్థానాలు చేరుకోలేక స్థానికులు చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. అనంతరం సానుకూలంగా స్పందించిన జోనల్ కమిషనర్ సమస్యలన్నీ విని తగిన చర్యలు తీసుకుంటామని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛభారత్ అభియాన్ సభ్యులు శ్రీకర్ రావు, వినోద్ గౌడ్, నర్వ పవన్, తోట రమేష్ , సుధా రవి, రేవతి , గోపి, వెంకటరమణ, ఆకుల రాము, లహరి, భగవంత్ రెడ్డి, ప్రేమ్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల బంగారు భవిష్యత్తు కు పునాదులు వేసేది ప్రధానోపాధ్యాయుల భాద్యత కీలకం

* **రంగారెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ బి.విజయ్ శేఖర్ గౌడ్**



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : విద్యార్థుల బంగారు భవిష్యత్తు కు పునాదులు వేసేది ప్రధానోపాధ్యాయుల భాద్యత కీలకమని రంగారెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ బి.విజయ్ శేఖర్ గౌడ్ అన్నారు. డివిజన్ పరిధిలోని గురుమూర్తి నగర్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సీ.హెచ్.సుదర్శన్ పదవీ విరమణ చేసిన సందర్భంగా సోమవారం చింతల్ లోని రంగారెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ కార్యాలయంలో డివిజన్ కార్పొరేటర్ విజయ్ శేఖర్ గౌడ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పదవీ విరమణ చేసిన సి.హెచ్.సుదర్శన్ కి శాలువ కప్పి మెమెంటో బహుకరించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించినందుకు కృతజ్ఞతలు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ మాజీ మహిళా అధ్యక్షురాలు రాణి, నందనగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు కార్తీక్ గౌడ్, సీనియర్ నాయకులు జగదీష్, తేజ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో పలుచోట్ల స్వల్ప భూప్రకంపనలు

గంగాధర: తెలంగాణలోని పలు జిల్లాల్లో భూమి స్వల్పంగా కంపించింది. కరీంనగర్, సిరిసిల్ల, నిజామాబాద్, నిర్మల్ జిల్లాల్లో భూ ప్రకంపనలు సంభవించాయి. కరీంనగర్ జిల్లాలోని గంగాధర, చొప్పదండి, రామడుగు, కమ్మర్పల్లి, మోర్తాడ్ తదితర మండలాల్లో భూమి 2 సెకన్లపాటు కంపించింది. మరోవైపు నిర్మల్ జిల్లాలోనూ భూ ప్రకంపనలు సంభవించాయి. కడెం, జన్నారం, ఖానాపూర్, లక్ష్మణ్చాందా మండలాల్లో 2 నుంచి 5 సెకన్లపాటు భూమి కంపించింది. భూకంప లేఖినిపై దీని తీవ్రత 3.8గా నమోదైంది. దీంతో ఆయా ప్రాంతాల్లోని ప్రజలు భయాందోళనలకు గురయ్యారు.

## క్రీడలు మానసిక ఉల్లసాన్ని పెంపొందిస్తాయి

* **కొత్తగూడెం జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు లక్కినేని సత్యనారాయణ**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: క్రీడలు మానసిక ఉల్లసాన్ని పెంపొందిస్తాయని కొత్తగూడెం జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు లక్కినేని సత్యనారాయణ అన్నారు. సోమవారం ఆధ్వర్యంలో ప్రకాశం స్టేడియం గ్రౌండ్ లో రెడ్డి భాస్కర్ ఆధ్వర్యంలో జరుగుతున్న కొత్తగూడెం క్రికెట్ చాంపియన్స్ ట్రోఫీ క్రికెట్ పోటీలకు ముఖ్యఅతిథిగా లక్కినేని సత్యనారాయణ హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకొని, టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. కాసేపు బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్యహపరిచారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఏ పోటీల్లో అయినా గెలుపు ఓటములు సహజమని అన్నారు. గెలిచినా వారు ఇంకా శ్రమిస్తూ ఉన్నత శిఖరాలు అధిరోహించలని, ఓడిన వారు మరింత పట్టుదలతో ఆడుతూ గెలుపు దిశగా అడుగులు వేయాలన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించడం కొరకు క్రీడాకారులను అందరినీ సమన్వయం చేసుకుంటూ క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. క్రికెట్ పోటీలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. మొదటి మ్యాచ్ న్యూ స్టార్స్ వర్సెస్ స్టార్ లెవెన్ మధ్య జరగగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న స్టార్ లెవెన్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 213 రన్స్ చేయగా తర్వాత బ్యాటింగ్ చేసిన న్యూ స్టార్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 108 రన్స్ చేయాగ స్టార్ లెవెన్ జట్టు 105 రన్స్ తేడాతో గెలుపొందారు. ఈకార్యక్రమంలో జేబీపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రాకామేష్, శ్రీనివాస్, రమేష్, క్రాంతి, గొల్లపల్లి అశోక్, అమీర్ తదితరులు పాల్గొన్నారు.

## పంట మార్పిడితో.. సుస్థిర ఆదాయం

* **దండు మల్కాపురంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం ప్రారంభం**
* **ఉబ్బు వెంకటయ్య**




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: రైతులు పంట మార్పిడి పాటించడం వల్ల సుస్థిర ఆదాయం సాధ్యం అవుతుందని చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చౌటుప్పల్ మండలంలో దండు మల్కాపురం గ్రామంలో సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య హాజరయ్యారు. రైతులతో మాట్లాడారు. వ్యవసాయంలో ఏ విధమైన పంటలు పండిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఉబ్బు వెంకటయ్య మాట్లాడుతూ తక్కువ యూరియా వాడండం ద్వారా సాగు ఖర్చును తగ్గించుకోవచ్చున్నారు. పంటకు సరిపడా రసాయనాలను మాత్రమే వినియోగించాలని సూచించారు. తద్వారా భూసారం కలిగి ఉంటుందని, నేల ఆరోగ్యంగా ఉంటుందన్నారు. వర్షాబావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని సాగు నీటిని ఆదా చేయాలని, తద్వారా భావితరాలకు నీరు అందించిన వారమవుతామన్నారు. వైస్ చైర్మన్ ఆకుల ఇంద్ర సేనా రెడ్డి మాట్లాడుతూ మొక్కలను విరివిగా నాటాలని, చెట్లను నరకవద్దని, అడవుల శాతాన్ని పెంచాలని, పర్యావరణాన్ని కాపాడాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శేఖర్ రెడ్డి, తహసిల్దార్ హరికృష్ణ, మండల వ్యవసాయ శాఖ అధికారి ముత్యాల నాగరాజు, డైరెక్టర్లు ఎండి గౌస్ ఖాన్, పబ్బు శ్రీకాంత్ గౌడ్, బోయ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు కనెక్టివిటీని పెంచడమే మోదీ సర్కార్ లక్ష్యం : కిషన్‌రెడ్డి



కాగజ్‌నగర్: కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు కనెక్టివిటీని పెంచడం మోదీ సర్కార్ లక్ష్యమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో జాతీయ రహదారుల విస్తీర్ణం 5వేల కి.మీ దాటిందని చెప్పారు. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ రూ.3,900 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు శంకు స్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ కార్యక్ర మానికి కిషన్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ''జాతీయ రహదారుల విస్తరణ వల్ల రోడ్డు ప్రమాదాలు, ప్రయాణ సమయం భారీగా తగ్గాయి. రోడ్డు, రైల్వే, విమాన కనెక్టివిటీ పెంచేందుకు కేంద్రం అంకితభావంతో పనిచేస్తోంది. దేశవ్యాప్తంగా 7 టెక్స్‌టైల్ పార్కులు మంజూరు చేస్తే తెలంగాణకు కూడా ఒకటి దక్కింది. రూ.6,330 కోట్లతో రామగుండంలో యూరియా ఉత్పత్తి పరిశ్రమను పునరుద్ధరించుకున్నాం. ఇచ్చిన హామీ ప్రకారం నిజామాబాద్ జిల్లాకు పసుపు బోర్డు మంజూరు చేశాం. ఆదిలాబాద్‌లో డిఫెన్స్ ఎయిర్‌పోర్టు ప్రారంభించేందుకు కేంద్రం సిద్ధమవుతోంది. దేశంలో 80 కోట్ల మంది పేదలకు ఉచితంగా రేషన్ బియ్యాన్ని మోదీ ప్రభుత్వం అందజేస్తోంది'' అని కిషన్‌రెడ్డి తెలిపారు.

## యూరియా అధికంగా వాడి.. పోషించే భూతల్లిని నాశనం చేయొద్దు: మంత్రి తుమ్మల

హైదరాబాద్: వ్యవసాయంలో మరిన్ని మార్పులు రావాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. వికారాబాద్ జిల్లా ధరూర్‌లో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వరి సాగులోనూ పాక్షికంగా ఆరుతడి విధానం పాటించాలన్నారు. పురుగు మందులు, యూరియా వాడకం బాగా తగ్గించాలని సూచించారు. యూరియా అధికంగా వాడి.. మనల్ని పోషించే భూతల్లిని నాశనం చేయొద్దని పేర్కొన్నారు. ''ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు మంచి ఆదాయం వస్తోంది. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో దీని సాగు పెరగాలి. ఇప్పుడు అన్ని జిల్లాల్లో ఈ పంట సాగుకు అనుమతి ఉంది. ఆయిల్‌పామ్‌లో మూడేళ్ల పాటు అంతర పంటలు కూడా వేసుకోవచ్చు. గతంలో ఈ పంట దిగుబడి ఆరేళ్లకు వచ్చేది.. ఇప్పుడు మూడేళ్లకే వస్తోంది. దీని సాగుతో నెలకు రెండుసార్లు జీతం వచ్చినట్లు రైతులకు ఆదాయం వస్తుంది.

## ప్రజల సమస్యలను పరిష్కరించడమే తన లక్ష్యం

* **ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్**



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : ప్రజల సమస్యలను పరిష్కరించడమే తన లక్ష్యమని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ ప్రధాన రహదారిలో మహాత్మాగాంధీ నగర్ వద్ద మ్యాన్ హోల్ మూత పగిలి వాహనదారులకు ప్రమాదకరంగా మారిందని స్థానిక వాసులు సమస్యను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ దృష్టికి తీసుకవచ్చారు. దీంతో కార్పొరేటర్ సమస్యను స్వయంగా పరిశీలించి వెంటనే నాలా లోని షిల్టు ను తొలగించి నూతన కవర్ ఏర్పాటుచేయాలని జి.ఎచ్.ఎం.సి సిబ్బందిని ఆదేశించారు. వెంటనే స్పందించి సమస్యను తక్షణమే పరిష్కరించిన కార్పొరేటర్ కి కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో చిన్నోళ్ల శ్రీనివాస్, మల్లేష్, అశోక్, ఫారూఖ్, కటికరవి, నాగార్జున, శివ తదితరులు పాల్గొన్నారు.

## మానవ శ్రమకు విలువ చేకూర్చిన మహామేధావి కార్ల్ మర్క్స

* **సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని**




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: పెట్టుబడి దారులకు సాగిస్తున్న దోపిడికి వ్యతిరేకంగా కార్మికులు, కష్టజీవులను ఏకం చేసే సిద్ధాంతాన్ని రూపకల్పన చేసి, మానవ శ్రమకు విలువ చేకూర్చిన మహామేధావి కార్ల్ మర్క్స అని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. మార్క్ 207వ జయంతిని పురస్కరించుకొని శేషగిరిభవన్ లో సోమవారం మార్క్స చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ మానవ శ్రమకు విలువ లేని పరిస్థితుల్లో శ్రమైక జీవులకు పని గంటలు, శ్రమకు తగిన వేతనం కోసం ఆయన చేసిన కృషి ప్రపంచ కార్మిక వర్గానికి తోడ్పాటును అందించిందన్నారు. సమాజ చరిత్ర అంతా వర్గపోరుతోనే ముడిపడి ఉంటుందని, ఈ వర్గపోరే అంతిమ విజయం సాధిస్తుందని చెప్పిన మహా మేదావి, మానవతావాది మార్క్స అని కొనియాడారు. కమ్యూనిస్టు సిద్ధాంత కర్తగా ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిన మార్క్స అడుగుజాడల్లో నేటితరం కమ్యూనిస్టులు డుచుకోవాలని, తద్వారా కమ్యూనిజాన్ని మరింతగా విస్తరింపచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోరిమి రాజ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు, సలిగంటి శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యులు దమ్మాలపాటి శేషయ్య, భూక్యా శ్రీనివాస్, కె రత్నకుమారి, ఎస్ కె ఫహీమ్, నూనావత్ గోవిందు, గుత్తుల శ్రీనివాస్, దారా శ్రీనివాస్, గొనె మని, సురేష్, లక్ష్మీనారాయణ ధనలక్ష్మి, దార లక్ష్మి, అక్తర్, శాంతి తదితరులు పాల్గొన్నారు.

# జమ్మూకశ్మీర్‌లో సమర్థవంతమైన పరిపాలన అందిస్తాం: సీఎం ఒమర్ అబ్దుల్లా

శ్రీనగర్: పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో జమ్మూకశ్మీర్‌లో పరిపాలన, అభివృద్ధి పనులు ఆగకుండా చూడాలని కేంద్రం సూచించినట్లు సీఎం ఒమర్ అబ్దుల్లా తెలిపారు. రాష్ట్రంలో సమర్థవంతమైన పాలన కొనసాగాలని ప్రధాని మోదీ చెప్పినట్లు ముఖ్యమంత్రి పేర్కొన్నారు.సెక్రటేరియట్‌లో మంత్రులు, రాష్ట్ర ఉన్నతాధికారులతో ఒమర్ అబ్దుల్లా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. "ఇటీవల జరిగిన పహల్గాం ఉగ్రదాడితో రాష్ట్రంలో ప్రతికూల పరిస్థితులు నెలకొన్నాయి. అయినప్పటికీ రాష్ట్రంలో సమర్థవంతమైన పరిపాలన, అభివృద్ధి కార్యక్రమాలు ఆగకూడదని ఇటీవలి సమావేశంలో ప్రధాని మోదీ సూచించారు. ఈ మేరకు కేంద్రప్రభుత్వం బాధ్యతలు తీసుకుంటుందని కూడా ఆయన హామీ ఇచ్చారు. పహల్గాం దాడి అనంతరం దేశం మొత్తం జమ్మూకశ్మీర్‌కు బాసటగా నిలుస్తోంది. ఇదే తరుణంలో త్వరలో జరగనున్న అమర్‌నాథ్ యాత్రను సజావుగా నిర్వహించేలా సమష్టి కృషి చేయాల్సిన అవసరం ఉంది. రాష్ట్రంలో ఉద్రిక్త పరిస్థితులు ఉన్నా.. పరిపాలన, ప్రజా కార్యక్రమాలకు ఆటంకం కలగకూడదు. ఈ మేరకు ఎన్ని చర్యలైనా తీసుకోవాలి. ఎంత ఖర్చయినా భరించాలి'' అని సీఎం వ్యాఖ్యానించారు. రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టుల ప్రారంభోత్సవంపై



ఒమర్ అబ్దుల్లా మాట్లాడారు. "ఉగ్రదాడి నేపథ్యంలో రాష్ట్రంలోని పలు ప్రాజెక్టులకు ప్రారంభోత్సవం చేయలేదు. కశ్మీర్‌లో ఏప్రిల్ 19న రైలును ప్రారంభించాల్సి ఉండగా.. ఉద్రిక్తతల కారణంగా వాయిదా వేశాం. త్వరలో రైలు, బ్రిడ్జికి ప్రారంభోత్సవం చేసి తీరుతాం. రానున్న ఆరు నెలలు పరిపాలన, ప్రజా శ్రేయస్సు కోసం ప్రభుత్వం పనిచేయాలి. పాలన కేవలం ప్రభుత్వ కార్యాలయాలకే పరిమితం కాకూడదు'' అని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. జమ్మూకశ్మీర్ డిప్యూటీ సీఎం సురీందర్ చౌధరీ, మంత్రులు సకీనా ఇటూ, జావేద్ అహ్మద్ రాణా, సీఎం సలహాదారు నాజిర్ అస్లామ్, సీఎస్ అటల్ దుల్లూ, ఉన్నతాధికారులు హాజరయ్యారు. కాగా ప్రధాని నరేంద్ర మోదీతో జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా శనివారం భేటీ కాగా.. పహల్గాం ఉగ్రదాడి అనంతరం ఇద్దరు నేతలు తొలిసారి సమావేశమై రాష్ట్రంలోని ఉద్రిక్త పరిస్థితులపై చర్చించారు.

## సివిల్ మాక్ డ్రిల్స్ నిర్వహించండి.. రాష్ట్రాలకు కేంద్రం సూచన

దిల్లీ: పహల్గాం ఉగ్రదాడితో భారత్ పాక్ మధ్య ఉద్రిక్త వాతావరణం కొనసాగుతున్న వేళ రాష్ట్రాలకు కేంద్రం కీలక సూచనలు చేసింది. దేశ భద్రతలో పౌరుల్ని సమాయత్తం చేసేందుకు బుధవారం (మే 7న) మాక్ డ్రిల్స్ నిర్వహించాలని కొన్ని రాష్ట్రాలకు కేంద్ర హోంశాఖ సూచించింది. భద్రతా సన్నద్ధతపై పౌరులకు అవగాహన కల్పించాలని, అత్యవసర సమయాల్లో ఎలా స్పందించాలో తెలపాలని పేర్కొంది. శత్రు దాడి జరిగినప్పుడు విద్యార్థులు, యువకులు స్వీయరక్షణతో పాటు ఎలా ప్రతిస్పందించాలో అవగాహన కల్పించాలి తెలిపింది. పాకిస్థాన్‌పై భారత్ ప్రతీకార దాడులు చేయొచ్చనే అంచనాలు నెలకొన్న తరుణంలో కేంద్ర హోంశాఖ ఈ తరహా ఆదేశాలు ఇవ్వడం గమనార్హం. పాక్ సైతం ప్రతిదాడికి దిగితే అందుకు ముందుగానే రాష్ట్రాలను సిద్ధం చేస్తున్నట్లు కనబడుతోంది. శత్రు దేశం దాడి చేస్తే ఎలా ఎదుర్కోవాలనే అంశాలపై సన్నద్ధతా కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొంది. ఎయిర్ రైడ్ హెచ్చరిక సైరెన్ల పనితీరును పరీక్షించాలని ఆదేశించింది. అత్యవసర సమయాల్లో ఎలా స్పందించాలో పౌరులకు తెలపాలని నిర్దేశించింది. పాకిస్థాన్ కవ్వింపు, రెచ్చగొట్టే




చర్యలకు పాల్పడే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యల్లో భాగంగా సరిహద్దు రాష్ట్రాలైన పంజాబ్, గుజరాత్, రాజస్థాన్‌తో పాటు జమ్మూకశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాలకు ఈ సూచనలు చేసినట్లు సమాచారం. ఆయా రాష్ట్రాలు అప్రమత్తంగా ఉండాలని ఇప్పటికే పలు సూచనలు చేసిన కేంద్రం.. తాజాగా నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో మాక్ డ్రిల్స్‌తో ప్రజల స్వీయ రక్షణలో భాగంగా మాక్ డ్రిల్స్ ద్వారా అవగాహన కల్పించడంపై దృష్టిసారించినట్లు తెలుస్తోంది. వైమానిక దాడులు జరిగితే.. ఎలా వ్యవహరించాలి? ప్రజలు ఆందోళనకు గురికాకుండా వారికి ఎలాంటి సూచనలు చేయాలి. సైరన్ ఇచ్చి ఎలా అప్రమత్తం చేయాలనే అంశంపై మాక్ డ్రిల్ చేయాలని పేర్కొంది.

## డిఫెన్స్ వెబ్‌సైట్లు లక్ష్యంగా.. పాక్ సైబర్ ముఠా దాడులు!

పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా భారత్ తీసుకుంటున్న చర్యలను పాకిస్థాన్ తట్టుకోలేకపోతోంది. సైబర్ దాడుల రూపంలో దొంగదారిలో మనల్ని దెబ్బతీయాలని చూస్తోంది. తాజాగా దాయాది కేంద్రంగా నడుస్తోన్న సైబర్ ముఠాలు మన రక్షణ రంగానికి చెందిన వెబ్‌సైట్లను లక్ష్యంగా చేసుకున్నాయని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. మిలిటరీ ఇంజినీర్ సర్వీసెస్, మనోహర్ పారికర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిఫెన్స్ అండ్ అనాలిసిస్‌కు చెందిన సున్నితమైన డేటా హ్యాకర్ల చేతికి వచ్చిందని పాకిస్థాన్ సైబర్ ఫోర్స్ ఎక్స్ వేదికగా ప్రకటించుకుంది. అలాగే రక్షణ శాఖ పరిధిలోని ఆర్మ్‌డ్ వెహికిల్ నిగమ్ లిమిటెడ్ వెబ్‌సైట్‌ను హ్యాక్ చేయడానికి ప్రయత్నించినట్లు చెప్పింది. దానికి సంబంధించిన చిత్రాలను పోస్టు చేసింది. ఈ నేపథ్యంలో ఈ ప్రభుత్వ సంస్థ ఆన్‌లైన్ వ్యవస్థను నిలిపివేసి, నష్టాన్ని అంచనావేస్తున్నారు. ఇతర దాడులను గుర్తించి, అడ్డుకునేందుకు సైబర్ సెక్యూరిటీ నిపుణులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. పహల్గాం ఉగ్రదాడితో దేశమంతా ఉలిక్కిపడిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత నుంచి భారత్‌లో పది లక్షల సైబర్ దాడులు చోటుచేసుకున్నట్లు మహారాష్ట్ర సైబర్ విభాగం రెండురోజుల క్రితం వెల్లడించింది. పాకిస్థాన్‌తోపాటు



ఇతర దేశాలకు చెందిన హ్యాకింగ్ గ్రూపుల నుంచి ఇవి జరిగినట్లు తెలిపింది. అలాగే జమ్ము మున్సిపల్ కార్పొరేషన్‌పై సైబర్‌దాడి జరిగిందని.. కీలకమైన డేటాను హ్యాకర్లు దొంగిలించారని అధికారులు వెల్లడించారు. ఈ దాడి జరగడంతో ప్రభుత్వ డేటాకు సంబంధించిన అనేక సర్టిఫికెట్లు పోయినట్లు తెలిపారు. వైబ్‌సైట్‌ను తిరిగి పునరుద్ధరించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ దాడులతో భారత ప్రభుత్వం సైబర్ సెక్యూరిటీ అలర్ట్ జారీ చేసిన సంగతి తెలిసిందే. ప్రభుత్వంలోని అన్ని మంత్రిత్వ శాఖలు, ఏజెన్సీలు తమ సైబర్ సెక్యూరిటీని మరింత కట్టుదిట్టం చేసుకోవాలని అధికారులకు సూచించింది.

## పీఎంవో కార్యాలయానికి రాహుల్.. సీబీఐ కొత్త చీఫ్ ఎంపికపై కీలక భేటీ!

దిల్లీ: లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీసోమవారం సాయంత్రం ప్రధాని కార్యాలయానికి (పీఎంవో) వెళ్లారు. కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) కొత్త చీఫ్‌ని ఎంపిక చేసేందుకు నిర్వహించిన భేటీలో ఆయన పాల్గొన్నారు. ప్రధాని కార్యాలయంలో నిర్వహించిన ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన సీబీఐ డైరెక్టర్ నియామక కమిటీ సమావేశానికి



రాహుల్‌తో పాటు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా హాజరయ్యారు. ప్రస్తుత సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్ పదవీ కాలం మే 25న ముగియనున్న తరుణంలో కొత్త చీఫ్ ఎంపికపై చర్చించినట్లు తెలుస్తోంది. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల నియామక కమిటీలో లోక్‌సభలో ప్రతిపక్ష నేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ సిఫారసు మేరకు కేంద్ర ప్రభుత్వం సీబీఐ డైరెక్టర్ నియామకాన్ని చేపడుతుంది.

## భారత్‌లో చొరబాటుకు యత్నం.. పాక్ పౌరుడి అరెస్ట్

భారత్‌లోకి అక్రమంగా చొరబడిన పాకిస్థాన్ పౌరుడిని భద్రతా బలగాలు అదుపులోకి తీసుకున్నాయి. ఆదివారం అర్ధరాత్రి పంజాబ్‌లోని గురుదాస్‌పూర్ సమీపంలో ఉన్న భారత్‌పాక్ సరిహద్దులో పాక్ పౌరుడు చొరబడ్డాడు. సరిహద్దులోని పొదల వద్ద అనుమానాస్పదంగా తచ్చాడుతుండటంతో భద్రతా బలగాలు అతడిని అదుపులోకి తీసుకున్నాయి. అతని వద్ద లభ్యమైన పాకిస్థాన్ జాతీయ గుర్తింపు ఆధారంగా పాక్‌లోని గుజ్రాన్‌వాలా నివాసి హుస్సేన్‌గా గుర్తించారు. ప్రస్తుతం పంజాబ్ పోలీసుల రిమాండ్‌లో ఉన్నాడు. విచారణ కొనసాగుతోందని పోలీసులు పేర్కొన్నారు. ఇదే విధంగా ఇటీవల రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్‌లోని భారత్‌పాక్ సరిహద్దులోకి ఓ పాక్ రేంజర్ చొరబడిన విషయం తెలిసిందే.




బీఎస్ఎఫ్ జవాన్లు అతడిని అదుపులోకి తీసుకున్నారు. భారత్‌పాక్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న తరుణంలో పాక్ రేంజర్ భారత్‌లోకి ప్రవేశించడం పలు అనుమానాలకు తావిస్తున్న నేపథ్యంలో మరో వ్యక్తి చొరబాటుకు యత్నించడంపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. మరో వైపు ఇటీవల అనుకోకుండా భారత్ సరిహద్దు దాటి పాక్‌లోకి ప్రవేశించిన ఓ బీఎస్ఎఫ్ కానిస్టేబుల్‌ను పాక్ ఆర్మీ నిర్బంధించిన సంగతి తెలిసిందే. ఆయన్ను విడుదల చేయాలని భారత్ సైనిక అధికారులు చర్చలు జరుపుతున్నప్పటికీ, ఫలితం కనిపించడం లేదు.

## అస్సాంలో పాక్ మద్దతుదార్లపై చర్యలు: 42 మంది అరెస్ట్



పహల్గాం దాడి తర్వాత పాకిస్థాన్‌కు మద్దతు తెలిపిన వారిపై అస్సాంలో చర్యలు తీసుకొన్నట్లు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ వెల్లడించారు. ఇప్పటి వరకు అరెస్ట్ చేసిన వారి సంఖ్య 42 చేరిందన్నారు. ఈ విషయాన్ని ఆయన ఆదివారం అర్ధరాత్రి ఎక్స్‌లో పోస్టు చేశారు. ఇప్పటికే ఇటువంటి ఆరోపణలపై ఏఐయూడీఎఫ్ ఎమ్మెల్యే అమినుల్ ఇస్లామ్‌ను అరెస్టు చేశారు. ఆయనపై దేశద్రోహం కేసు పెట్టినట్లు నాడు సీఎం ప్రకటించారు. మరోవైపు అమినుల్ వ్యాఖ్యలతో తమ పార్టీకి ఎటువంటి సంబంధం లేదని ఏఐయూడీఎఫ్ ప్రకటించింది. ఆ వ్యాఖ్యలు పూర్తిగా అమినుల్ వ్యక్తిగతమని పేర్కొంది. ఇటీవల ధుబ్రిలో పంచాయతీ ఎన్నికల ర్యాలీలో సీఎం హిమంత బిశ్వ శర్మ మాట్లాడారు. "పహల్గాం దారుణోదంతం తర్వాత కూడా ఇక్కడ పాక్‌కు అనుకూలంగా నినాదాలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. అవసరమైతే వారి కాళ్లు విరగ్గొట్టాలి. రాష్ట్రంలో పాకిస్థాన్‌కు అనుకూలంగా వ్యాఖ్యలు చేసిన పలువురిని అరెస్టు చేశాం. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకున్నాం. అయినా కొంతమంది ఆకతాయిలు పాక్‌కు అనుకూల నినాదాలు చేస్తున్నారు. నిర్దాక్షిణ్యంగా వారి కాళ్లు విరగ్గొట్టి మరీ అరెస్ట్ చేసి జైల్లో వేయాలని పోలీసులకు ఈ సందర్భంగా సూచిస్తున్నా. ఉగ్రవాదులు భారత్‌లోకి చొరబడి అమాయక ప్రజలను చంపినా.. ఇక్కడి నుంచి పాక్‌కు మద్దతు తెలపడం దారుణం. మన దేశంలో నివసిస్తూ.. ఇక్కడి తిండి తింటూ పాక్‌కు మద్దతు తెలిపేవారు మాకు అవసరం లేదు. అలాంటి వారిని దేశం, రాష్ట్రం క్షమించదు, సహించదు'' అని సీఎం గట్టిగా హెచ్చరించారు. ఇక జోర్హాట్ ఎంపీ గౌరవ్ గొగోయ్ పాకిస్థాన్‌లో పర్యటించటాన్ని కూడా హిమంత తప్పుపట్టారు. అక్కడి ఎన్‌జీవో ఇస్తున్న సొమ్మును గౌరవ్ తీసుకొంటున్నారని ఆరోపించారు. అంతేకాదు.. పాక్‌కు మద్దతు తెలిపిన 40 అరెస్టు చేసినప్పుడు.. ఆ దేశాన్ని పర్యటించిన గొగొయ్‌పై కూడా చర్యలు తీసుకోవచ్చన్నారు. పాక్‌లో ఆయన ఏ ప్రాంతాల్లో తిరిగారో సమాచారం ఇవ్వాలన్నారు.

## ఎప్పుడు చూసినా ఇదే తీరు.. ఈడీపై సుప్రీం అసహనం

సరైన ఆధారాలు సేకరించకుండా కొందరు వ్యక్తులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అభియోగాలు మోపుతోందని సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. "ఈడీపై మాకు చాలా ఫిర్యాదులు వచ్చాయి. ఆధారాలను ప్రస్తావించకుండా అభియోగాలు మోపుతున్న తీరు వాటిలో కనిపిస్తోంది'' అని పేర్కొంది. రూ.2,000 కోట్ల మద్యం కుంభకోణానికి చెందిన మనీ లాండరింగ్ కేసులో నిందితుడి బెయిల్ పిటిషన్‌పై విచారణలో భాగంగా ఈ విధంగా స్పందించింది. రూ.40 కోట్లు సంపాదించారని ఆరోపణలు చేసి, సదరు వ్యక్తికి ఏ కంపెనీతో సంబంధం ఉందో చెప్పలేకపోతున్నారని ఆగ్రహం వ్యక్తంచేసింది.ఇదే కేసులో ఇటీవల జరిగిన విచారణలో సుప్రీం తీవ్ర వ్యాఖ్యలు చేసింది. "దర్యాప్తు శాశ్వతంగా కొనసాగుతుంది. మూడు ఛార్జిషీట్లు దాఖలయ్యాయి. మీరు నిందితుడిని కస్టడీలో ఉంచి శిక్షిస్తున్నారు. విచారణ ప్రక్రియనే శిక్షగా మార్చారు'' అని పేర్కొంది.

# పోలవరం ప్రాజెక్టును సందర్శించిన అంతర్జాతీయ నిపుణుల బృందం



పోలవరం: పోలవరం ప్రాజెక్టును అంతర్జాతీయ నిపుణుల బృందం సందర్శించింది. ఇక్కడ జరుగుతున్న వివిధ నిర్మాణ పనులను వారు పరిశీలించారు. ఈ బృందం తగు సూచనలు, సలహాలను జలవనరుల శాఖ అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులకు ఇవ్వనుంది. అంతర్జాతీయ నిపుణులు రిచర్డ్ డొన్నెల్లి, సీన్ హించ్ బెర్జర్, జియాన్ఫ్రాన్కో డి సికో, డేవిడ్ బి పాల్ ప్రాజెక్టు నిర్మాణ పనులను పరిశీలించారు. వీరితో పాటు పీపీఏ సభ్య కార్యదర్శి ఎం.రఘురాం, కేంద్ర జలసంఘం అధికారులు, సరబ్జిత్ సింగ్ భక్షి, రాకేశ్, అశ్వనీకుమార్ వర్మ, గౌరవ్ తివారీ, హేమంత్ గౌతమ్, సీఎస్ఎంఆర్ఎస్ అధికారులు మనీష్ గుప్తా, లలిత్ కుమార్ సోలంకి పనులు జరుగుతున్న తీరుపై సమీక్షించారు. ప్రాజెక్టు సీఈ కె.నరసింహమూర్తి, ఎంఈఐఎల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సతీష్‌బాబు పనుల పురోగతిని వారికి వివరించారు. నిపుణుల బృందం సభ్యులు డయాఫ్రం వాల్ పనులు, ఎగువ కాఫర్ డ్యామ్ పటిష్ఠతపై ఆరా తీశారు. కృష్ణా నది యాజమాన్య బోర్డుకు ఏపీ ప్రభుత్వం లేఖ కృష్ణా నది యాజమాన్య బోర్డుకు ఏపీ ప్రభుత్వం లేఖ రాసింది. ఇవాళ్టి త్రిసభ్య కమిటీ సమావేశానికి హాజరు కాలేమని అందులో పేర్కొంది. పోలవరం ప్రాజెక్టు పరిశీలనకు నిపుణులు వస్తున్నారని అందులో వివరించింది. ఈ నెల 10 తర్వాత త్రిసభ్య కమిటీ భేటీ ఏర్పాటు చేయాలని ఏపీ ఈఎన్‌సీ కోరారు. ఇకపై కృష్ణా బోర్డు సమావేశాలు విజయవాడలోనే నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

## రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు : కొలుసు పార్థసారథి



అమరావతి: పింఛను పంపిణీలో అనేక జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఏపీ సమాచారశాఖ మంత్రి పార్థసారథి తెలిపారు. లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా పింఛను అందించే బాధ్యత అధికారులదేనని చెప్పారు. అమరావతిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాల పంపిణీలో ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. అకాల వర్షాలు, పంట నష్టంపై సీఎం సమీక్ష నిర్వహించారని, కొన్ని చోట్ల ధాన్యం తడిసినట్లు కలెక్టర్లు సీఎం దృష్టికి తీసుకెళ్లారని చెప్పారు. "రంగు మారిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని సీఎం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఏ రైతూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ధాన్యం ఎలా ఉన్నా ప్రభుత్వమే వాటిని కొనుగోలు చేస్తుంది. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుంది"అని పార్థసారథి తెలిపారు.

## ఏపీ మద్యం కుంభకోణం..
## అనుమానితుల పిటిషన్లపై సుప్రీంలో విచారణ



దిల్లీ: ఏపీ మద్యం కుంభకోణంలో ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ ముగ్గురు అనుమానితులు సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్లపై నేడు విచారణ జరిగింది. మాజీ సీఎం జగన్ కార్యదర్శి ధనుంజయ్‌రెడ్డి, ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి, భారతీ సిమెంట్స్ పూర్తి కాలపు డైరెక్టర్ బాలాజీ గోవిందప్ప పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈక్రమంలో నేడు విచారణ చేపట్టిన జస్టిస్ పార్థివాలా నేతృత్వంలోని ధర్మాసనం.. హైకోర్టులో విచారణ పెండింగ్‌లో ఉన్నందున ఎలాంటి మధ్యంతర ఆదేశాలు ఇవ్వలేమని స్పష్టం చేసింది. అరెస్ట్ చేయకుండా ఉండేందుకు స్టే ఇవ్వాలని ఆ ముగ్గురి తరఫు న్యాయవాదులు కోరగా ధర్మాసనం నిరాకరించింది. అరెస్ట్ చేయబోం అని రాష్ట్ర ప్రభుత్వం స్టేట్‌మెంట్ ఇవ్వాలని నిందితుల తరఫు న్యాయవాదులు కోరగా.. అలా ఇవ్వడం కుదరదని ప్రభుత్వం తరఫు న్యాయవాదులు స్పష్టం చేశారు. ఈ క్రమంలో స్పందించిన జస్టిస్ పార్థివాలా.. తమ పరిధి, అధికారాల ప్రకారం నడుచుకునే స్వేచ్ఛ రాష్ట్ర ప్రభుత్వానికి ఉందన్నారు. ఎల్లుండి జరిగే విచారణలో ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని ధర్మాసనం హైకోర్టుకు సూచించింది. ఈ కేసుకు సంబంధించి మెరిట్స్‌పై ఎలాంటి కామెంట్స్ చేయడం లేదని.. నిర్ణయాధికారం హైకోర్టుదే అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. హైకోర్టులో విచారణ ముగిసి ఆదేశాలు ఇచ్చిన తర్వాత తదుపరి విచారణ చేపడతామని తెలిపింది.

## నీట్ రాసిన తల్లీకుమార్తె





ఖమ్మం: నీట్ పరీక్షకు ఓ విద్యార్థినితో పాటు ఆమె తల్లి కూడా హాజరవ్వడం విశేషం. వీరిద్దరూ ఆదివారం వేర్వేరు జిల్లాల్లో పరీక్ష రాశారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం మంచ్యానాయక్ తండాకు చెందిన భూక్యా సరిత(38) ప్రస్తుతం ఆర్ఎంపీగా పనిచేస్తున్నారు. 2007లో బీఎస్సీ నర్సింగ్ చివరి సంవత్సరంలో ఉండగా వివాహం కావడంతో పరీక్ష రాయలేకపోయారు. ఆ తర్వాత ఇద్దరు కుమార్తెలు జన్మించడంతో కోర్సు పూర్తి చేయలేకపోయారు. ఈమె భర్త భూక్యా కిషన్ కూడా ఆర్ఎంపీగా చేస్తున్నారు. వీరిద్దరూ తమ కుమార్తెను ఎంబీబీఎస్ చదివించి డాక్టర్‌ను చేయాలనుకున్నారు. ఖమ్మంలో కుమార్తె నీట్ శిక్షణ పొందుతున్న సమయంలో తల్లికి కూడా పరీక్ష రాయాలనే ఆకాంక్ష కలిగింది. దీంతో ఆమె కూడా పరీక్షకు సన్నద్ధమయ్యారు. తల్లి సరిత సూర్యాపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షకేంద్రంలో.., కుమార్తె కావేరి.. ఖమ్మంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎన్ఎస్‌పీ క్యాంపు కేంద్రంలో పరీక్ష రాశారు.

### 72 ఏళ్ల వయసులోనూ ఉత్సాహం

ఆమెకు 72 ఏళ్లు. ఈ వయసులో నీట్ రాశారు. పరీక్ష కేంద్రం వద్ద ఉన్న వాళ్లు ఆమె ఉత్సాహాన్ని ఆసక్తిగా తిలకించారు. కాకినాడకు చెందిన పోతుల వెంకటలక్ష్మి నీట్ పరీక్ష రాసేందుకు కాకినాడలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రానికి ఆదివారం వచ్చారు. చదువుకు వయసు అడ్డంకి కాదని నిరూపించారు.

## జగన్ జమానాలో ఆర్బీకే నిధులు దుర్వినియోగం..
## సీఎం చంద్రబాబుకు భూమిరెడ్డి ఫిర్యాదు



అమరావతి: జగన్ జమానాలో రైతు భరోసా కేంద్రాల (ఆర్బీకే) నిర్వహణలో నిధులు దుర్వినియోగమయ్యాయని తెదేపా ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి ఆరోపించారు. ఈమేరకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆయన ఫిర్యాదు చేశారు. ఆర్బీకేలకు నిధులు ఇవ్వకుండా వైకాపా హయాంలో మంత్రులు స్వాహా చేశారని అందులో పేర్కొన్నారు. ఏడాదికి రూ.26 కోట్ల మేర నాలుగేళ్లకు రూ.104 కోట్లు స్వాహా చేశారని ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని భూమిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

## చెప్పులు విడిచి..
## ధాన్యం కల్లాలలో నడిచిన మంత్రి నాదెండ్ల

* అకాల వర్షా లతో తడిసిన ధాన్యంపై మంత్రి నాదెండ్ల మనోహర్ క్షేత్రస్థాయి పరిశీలన
* కాకినాడ జిల్లా పెద్దాపురం, జగ్గంపేట, కాకినాడ రూరల్ మండలాల్లో పర్యటన
* రైతులతో నేరుగా మాట్లాడి, ప్రభుత్వ అండపై భరోసా కల్పించిన మంత్రి
* ప్రతి గింజను ప్రభుత్వమే కొంటుందని, దళారుల బారిన పడొద్దని హితవు



రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సోమవారం కాకినాడ జిల్లాలో పర్యటించారు. ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా తడిసిపోయిన ధాన్యాన్ని పరిశీలించి, రైతులకు ప్రభుత్వ అండపై భరోసా కల్పించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో పరిస్థితిని అంచనా వేసేందుకు ఈ పర్యటన చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఉదయం పెద్దాపురం మండలం జే.తిమ్మాపురం, జగ్గంపేట మండలం కాట్రాపల్లి గ్రామాల్లో మంత్రి పర్యటించారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ చైర్మన్ తోట సుధీర్, కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, ఇతర అధికారులతో కలిసి కల్లాల్లో ఆరబోసిన, తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల కాళ్లకు ధరించిన చెప్పులు విడిచి కల్లాల్లో నడిచారు. తద్వారా, చెప్పులతో ధాన్యం తొక్కకూడదన్న రైతుల సెంటిమెంట్ ను గౌరవించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అకాల వర్షం వల్ల రైతులకు కలిగిన నష్టాన్ని ప్రభుత్వం పూర్తిగా అర్థం చేసుకుందని, ప్రతి రైతునూ ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. అనంతరం కాకినాడ రూరల్ మండలం చీడిగా హైవే రోడ్డుపై ఆరబోసిన ధాన్యాన్ని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీతో కలిసి మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని, తొందరపడి దళారులకు తక్కువ ధరకు ధాన్యాన్ని అమ్ముకోవద్దని సూచించారు. ప్రభుత్వం ప్రతి గింజనూ బాధ్యత తీసుకుని కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పించే కనీస మద్దతు ధరకే ధాన్యాన్ని విక్రయించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. కాకినాడ జిల్లాలో ఇప్పటివరకు రైతు సేవా కేంద్రాల ద్వారా 59 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, మొత్తం 95 వేల మెట్రిక్ టన్నులు కొనాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి వివరించారు. గత వైసీపీ ప్రభుత్వంతో పోలిస్తే ఈసారి కూటమి ప్రభుత్వం 11 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అదనంగా కొనుగోలు చేసిందని తెలిపారు. రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా రైతుల ఖాతాల్లో రూ. 11,300 కోట్లు జమ చేశామని గుర్తుచేశారు. జిల్లాలోని 225 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన సిబ్బందిని, గోనె సంచులను అందుబాటులో ఉంచామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా వర్ష ప్రభావిత ప్రాంతాల్లో రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని, ఎవరూ అపోహలు నమ్మవద్దని మంత్రి మనోహర్ పేర్కొన్నారు.

# తరగని అందాల గని... ఆంధ్రావని!



అరసవిల్లి నుంచి అర్ధగిరి ఆంజనేయ స్వామి దాకా... బెజవాడ కనకదుర్గమ్మ నుంచి కాణిపాకం గణపయ్య దాకా... ఎన్నెన్ని ప్రసిద్ధ ఆలయాలో... ఎందరెందరు వేల్పులో... ఈ రాష్ట్రం పొడవునా! భక్తుల తాకిడి పరంగా తిరుమల తిరుపతి వేంకటేశ్వరస్వామి దేవాలయం అగ్రస్థానం వహిస్తే... అనంతపురం లేపాక్షి ఆలయం అద్భుత శిల్పకళకి సాక్ష్యమిస్తుంది. వెంకన్న ఆలయం దక్షిణాదిలోని 52 వైష్ణవ దివ్యదేశాల్లో ఒకటైతే... శ్రీకాళహస్తి, పంచమహాలింగాల్లో వాయులింగంగా ప్రసిద్ధిగాంచింది. శ్రీశైలం మల్లికార్జునుడు ద్వాదశ జ్యోతిర్లింగాలకు చెందినవాడైతే... భ్రమరాంబ అష్టాదశ పీఠాల అంశ. అన్నట్టు లక్ష్మీనృసింహ ఆలయాలు ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటి. సింహాచలం, మంగళగిరి, కేతవరం, అహోబిలం, వేదాద్రి తదితరాలెన్నో ఉన్నాయిక్కడ. తిరుపతి సమీపంలోని గుడిమల్లం ఆలయ శివలింగం మనదేశంలోనే అత్యంత ప్రాచీనమైనదిగా వినుతికెక్కింది.

### అరణ్యాల్లో అతిచల్లగా...

నట్టనడి వేసవిలోనూ అతిచల్లగా అనిపించే పర్వత ప్రాంతాలు ఆంధ్రలో ఎన్నో ఉన్నాయి. ఆ జాబితాలో కొత్తగా వచ్చి చేరిన లంబసింగి దక్షిణాది కశ్మీరం అనిపించుకుంటోంది! అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉన్న ఈ పర్వతప్రాంతంలో నవంబర్‌డిసెంబర్‌లలో అయితే శీతోష్ణస్థితి సున్నాకి పడిపోయి... మంచువాన కురుస్తుంది. ఇక్కడికి రావాలనుకున్నవాళ్లు అనకాపల్లిలో దిగి నర్సీపట్నానికి చేరుకుంటే అక్కడి నుంచి చీపురుపల్లికి వెళ్లే బస్సు ద్వారా లంబసింగికి చేరుకోవచ్చు. ఇక, పేదవాళ్ల ఊటీగా పేరుగాంచిన హార్స్‌లీహిల్స్‌కి ఈ మధ్య ఎన్నో కొత్త వసతులు వచ్చాయి. నిత్యహరితంగా అలరారే అరకు పారాగ్లైడింగ్ పోటీలతోనూ పర్యటకుల్ని అలరిస్తోంది. ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ కోనసీమజిల్లాలో నిర్వహిస్తున్న వనవిహారీ, నల్లమలల్లోని బైర్లూటి(నంద్యాల జిల్లా), రోళ్లపాడు(కర్నూలు జిల్లా)ల్లో నిర్వహిస్తున్న జంగిల్ సఫారీలూ దేశం నలుమూలల నుంచీ జంతు ప్రేమికుల్ని రప్పిస్తున్నాయి. చిత్తూరు జిల్లాలోని నన్యాల ఏనుగుల క్యాంప్... పర్యటకులు కరిరాజుల్ని అతిదగ్గరగా చూసే అవకాశాన్నిస్తోంది.

### నదుల ఒడిలో...

కోనసీమ... ఆంధ్రప్రదేశ్‌లో కొలువైన కేరళ! ఇక్కడి దిండీ గ్రామంలో ఏపీటీడీసీ నిర్వహిస్తున్న 'హరిత కోకోనట్ కంట్రీ రిసార్ట్' నుంచీ బోటుహౌస్ సేవలుంటున్నాయి. అటు నర్సీపట్నం నుంచి ఇటు రాజోలు వరకూ రోజూ 50 కిలోమీటర్లు తీసుకెళ్లి... కొబ్బరిసీమల అందాన్ని తనివితీరా ఆస్వాదించేలా చేస్తున్నారు. ఇద్దరు పెద్దవాళ్లూ ఇద్దరు పిల్లలూ ఉన్న కుటుంబానికి 12 గంటలకి రూ.12 వేలు... 24 గంటలకి రూ.15 వేల రూపాయలు తీసుకుంటున్నారు. ఇదికాకుండా... గోదావరి మీదే రాజమహేంద్రవరం నుంచీ, గండిపోచమ్మ నుంచీ పాపికొండలకి ప్రతిరోజూ ఓ బోట్‌ని నడుపుతోంది ఏపీటీడీసీ సంస్థ. కృష్ణానదిపైన... విజయవాడ భవానీ దీవికి బోట్ ప్రయాణం సందర్శకుల్ని ఉర్రూతలూగిస్తుంది. శ్రీశైలంలోని పాతాళ గంగ రోప్‌వే కమ్ బోటింగ్ కూడా ఓ చక్కటి అనుభవంగా మిగిలిపోతుంది. శ్రీకాకుళంలోని తేలినీలాపురం చెరువు, పశ్చిమ గోదావరిలో ప్రసిద్ధిగాంచిన కొల్లేరు, నెల్లూరు నేలలోని నేలపట్టు, చిత్తూరు జిల్లాలోని పులికాట్ చెరువులు ఏటా విదేశీ పక్షుల్ని ఆహ్వానిస్తున్నాయి.

### అందాల తీరాలు...

దక్షిణాదిలో అతిపెద్ద సముద్ర తీరం(సుమారు 974 కి.మీ) ఉన్న రాష్ట్రం... ఆంధ్రప్రదేశ్. అందులోనూ విశాఖ రుషికొండ సముద్రతీరం తక్కువ అలలతో అత్యంత సురక్షితమైందిగా ప్రసిద్ధిచెందింది. కాకినాడ సమీపంలోని కోరింగ మడ అడవి విస్తీర్ణంపరంగా దేశంలోనే రెండో అతిపెద్దది... అభయారణ్యంగానూ సుందరబన్స్ తర్వాత చెప్పుకోదగ్గది. యానాం, మచిలీపట్నంలోని మంగినపూడి, బాపట్ల సూర్యలంక బీచ్, నెల్లూరు మైపాడు తీరాలు పర్యటకులకి సూదంటురాళ్లు!

### గుహలూ, కోటలూ, సైన్యూ!

అరకు వెళ్లినవాళ్లందరూ బొర్రాగుహల్ని చూస్తారు కదా! వాటి స్థాయిలోనే దక్షిణాదిలోనే అతిపెద్దవైన అనంతపురం బెలుం గుహల్నీ, నంద్యాల దగ్గర వాల్మీకి గుహల్నీ తీర్చిదిద్దింది రాష్ట్ర ప్రభుత్వం. కడపజిల్లాలోని గండికోట... కేవలం కోటగానే కాదు ఓ ప్రకృతి అద్భుతంగా గుర్తింపు సాధిస్తోంది. ఏటవాలుగా ఉండే రెండు కొండపేట్ల నడుమ ప్రవహించే పెన్నా నది అందం... భారతదేశ 'గ్రాండ్ కెన్యాన్' అని పిలిచేలా చేస్తోంది. ఆంధ్రుల ప్రాచీన వైభవానికి అద్దంపట్టే అమరావతి బౌద్ధ స్తూపం... దేశంలోనే అతిపెద్దది! ఆంధ్రప్రదేశ్‌లో పర్యటన గురించి ఎంత చెప్పినా తక్కువే. ఏడాదికోసారైనా ఒక్కోప్రాంతాన్ని ఎంచుకుని పర్యటించి చూడండి... రాష్ట్ర పర్యటక శాఖ నినాదం చెబుతున్నట్టు 'ఈ నేలని ఎంతగా చూస్తే... అంతగా ప్రేమిస్తారు'!









# ఈ గింజలతో అందంగా..!



**చర్మాన్ని లోలోపలి నుంచి మెరిపించే సహజసిద్ధమైన పదార్థాల్లో సబ్జా గింజలు ఒకటి. వీటిని ఆహారంగా తీసుకుంటే జీవక్రియలన్నీ సజావుగా సాగుతాయి. ఈ గింజలను తీసుకోవడం వల్ల ఆరోగ్యపరంగానే కాదు.. సౌందర్యపరంగానూ ఎన్నో ప్రయోజనాలు పొందచ్చంటున్నారు నిపుణులు. అవేంటో తెలుసుకుందాం రండి..**

### డీటాక్సిఫికేషన్..

వాహనాల నుంచి వెలువడే పొగ, కాలుష్యం కారణంగా.. చర్మం కాంతిని కోల్పోతుంది. దుమ్ము, ధూళి ప్రభావం వల్ల చర్మంపై మొటిమలు వచ్చే అవకాశం ఎక్కువ. అయితే కాలుష్యం ప్రభావాన్ని తగ్గించడానికి చర్మాన్ని లోలోపలి నుంచి శుభ్రం చేయాలంటే సబ్జా గింజలు అందుకు సరైన ఎంపిక అంటున్నారు నిపుణులు. వీటిలో ఉండే సహజ డీటాక్స్ గుణాలు చర్మం లోపలి పొరల్లో చేరిన టాక్సిన్లను బయటకు పంపిస్తాయి. దీనివల్ల సౌందర్య సమస్యలు తగ్గి చర్మం మెరుపును సంతరించుకుంటుంది.

### ఇన్ఫెక్షన్లు రాకుండా..

కొంతమందిలో చర్మ సంబంధిత ఇన్ఫెక్షన్లు వచ్చాయంటే ఓ పట్టాన తగ్గవు. అలాంటివారు క్రమం తప్పకుండా సబ్జా గింజలను ఆహారంగా తీసుకోవడం మంచిది. వీటిలో ఉన్న యాంటీ మైక్రోబియల్, యాంటీ ఫంగల్, యాంటీ బయోటిక్ గుణాలు చర్మానికి ఇన్ఫెక్షన్లు కలిగించే బ్యాక్టీరియా, ఇతర సూక్ష్మక్రిములను నశింపచేస్తాయి. దీనివల్ల చర్మం ఇన్ఫెక్షన్లకు గురవకుండా ఉంటుంది.

### కాంతివంతంగా..

సబ్జా గింజల్లో చర్మానికి మేలు చేసే విటమిన్ 'ఇ' పుష్కలంగా లభిస్తుంది. ఇది చర్మానికి అవసరమైన పోషణనిచ్చి, కాంతివంతంగా మారేలా చేస్తుంది. అలాగే ఈ గింజల్లో విటమిన్ 'ఎ', విటమిన్ 'సి', పొటాషియం, మెగ్నీషియం, కాపర్.. లాంటి పోషకాలు పుష్కలంగా లభిస్తాయి. ఇవన్నీ చర్మ సౌందర్యాన్ని ద్విగుణీకృతం చేసేవే. దీంతో చర్మానికి తగినంత పోషణ అంది ఆరోగ్యంగా, మృదువుగా మారుతుంది.

### ముడతలు పడకుండా..

ఇరవైల నుంచి ముప్పైల్లోకి రాగానే మహిళలంతా ఎదుర్కొనే సమస్య చర్మం ముడతలు పడడం. దీనివల్ల చిన్న వయసులోనే వృద్ధాప్య ఛాయలు కనిపిస్తాయి. అయితే ఇలా కనిపించకుండా ఉండటం కోసం చాలామంది యాంటీ ఏజింగ్ క్రీంలను వాడుతుంటారు. కానీ ఈ సమస్యకు సబ్జా గింజలు మేలైన పరిష్కారం చూపుతాయంటున్నారు నిపుణులు. వీటితో తయారుచేసిన ఫేస్‌ప్యాక్ వేసుకుంటే మంచి ఫలితం కనిపిస్తుంది. చెంచా కొబ్బరి నూనెలో సరిపడినంత సబ్జా గింజల పొడిని కలపాలి. ఈ పేస్ట్‌ని ముఖానికి రాసుకొని ఆరిన తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేసుకుంటే సరిపోతుంది.

### కురులు దృఢంగా..

సబ్జా గింజలు చర్మానికే కాదు జుట్టుకు కూడా మేలు చేస్తాయి. దీనిలో విటమిన్ 'కె', బీటా కెరోటిన్, ప్రొటీన్లు అధికంగా ఉంటాయి. ఇవి వెంట్రుకలు, కుదుళ్లు దృఢంగా మారేలా చేస్తాయి.

# లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..

**సెన్సెక్స్ 300 పాయింట్లు జంప్**




**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం లాభాల్లో ముగిశాయి. బ్యాంకింగ్ రంగంలో తప్పా మిగతా అన్నిరంగాల్లో కొనుగోళ్లు కనిపించాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 80,661.62 పాయింట్ల వద్ద స్వల్ప లాభాల్లో మొదలైంది. చివరి వరకు అదే జోరును కొనసాగించాయి. ఈ క్రమంలో ఇంట్రాడేలో సెన్సెక్స్ 80,657.71 పాయింట్ల కనిష్ఠానికి చేరగా.. అత్యధికంగా 81,049.03 పాయింట్లకు పెరిగింది. చివరకు 294.85 పాయింట్ల లాభంతో 80,796.84 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 114.45 పాయింట్లు పెరిగి.. 24,461.15 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో దాదాపు 2462 షేర్లు లాభాలను నమోదు చేశాయి.

మరో 1404 షేర్లు పతనం కాగా.. 171 షేర్లు మారలేదు. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు ఒక్కొక్కటి ఒక శాతం కంటే ఎక్కువ పెరిగాయి. బ్యాంకింగ్ మినహా మిగతా అన్ని రంగాల సూచీలు ఆటో, పవర్, ఎనర్జీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్, మెటల్, ఎఫ్ఎంసీజీ, ఆయిల్, గ్యాస్ ఒక్కొక్కటి ఒకశాతం పెరిగాయి. నిఫ్టీలో అదానీ పోర్ట్స్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, ట్రెంట్, శ్రీరామ్ ఫైనాన్స్, ఎంఅండ్ఎం అత్యధికంగా లాభపడ్డాయి. కొటక్ మహీంద్రా బ్యాంక్, ఓఎన్‌జీసీ, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, జెఎస్‌డబ్ల్యూ స్టీల్, ఎస్‌బీఐ నష్టపోయాయి.

## మే నెలలో కార్ల పండగ



**న్యూఢిల్లీ:** నూతనంగా విడుదలయ్యే కార్ల కోసం ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో మే నెలలో వారి నిరీక్షణకు తెరపడనుంది. వోక్స్ వ్యాగన్, కియా, ఎంజీతో సహా పలు ప్రధాన వాహన తయారీ సంస్థలు తమ తాజా మోడళ్లను మార్కెట్ లోకి విడుదల చేయనున్నాయి.

### కియా క్లావిస్

కియా క్లావిస్ కారు మే 8వ తేదీన విడుదల కానుంది. ఆ కంపెనీకి చెందిన కారెన్స్ కారు ఆధారంగా దీన్ని రూపొందించారు. ఆకట్టుకునే బాహ్య డిజైన్, నూతన ఇంటీరియర్ తో పాటు భద్రతకు ఎంతో ప్రాధాన్యమిచ్చారు. మూడు ప్యాడ్ ఎల్ఈడీ హెడ్ లైట్లు, డేటైమ్ రన్నింగ్ లైట్లు, నిటారుగా ఉండే ఫ్రంట్ ఫేసియా, అల్లాయ్ వీల్స్, ముందు వెనుక బంపర్లు చాలా బాగున్నాయి. కారెన్స్ కారకు పూర్తిగా భిన్నమైన లుక్ ను తీసుకువచ్చారు. ఇంటీరియల్ డిజైన్ గురించి వివరాలు అందుబాటులో లేవు.

పనోరమిక్ సన్ రూఫ్, డ్యూయల్ జోన్ ఆటోమేటిక్ క్లైమేట్ కంట్రోల్, వెంటిలేటెడ్ సీట్లు, ప్రీమియం ఆడియో సిస్టమ్, వైర్ లెస్ చార్జర్, యాంబియంట్ లైటింగ్, 360 డిగ్రీ కెమెరా అదనపు ప్రత్యేకతలు.

1.5 లీటర్ టర్బో డీజిల్, 1.5 లీటర్ నేచురల్లీ ఆస్పిరేటెడ్ పెట్రోలు, 1.5 లీటర్ టర్బో పెట్రోలు ఇంజిన్ల ఎంపికల్లో అందుబాటులో ఉంది.

### ఎంజీ విండ్సర్

ఎంజీ విండ్సర్ ఎలక్ట్రిక్ కారును మే నెలలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేశారు. దీనిలో 50 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ ప్యాక్ ఏర్పాటు చేశారు. సింగిల్ చార్జింగ్ పై సుమారు 460 కిలోమీటర్ల రేంజ్ వస్తుంది. మోటారు మాత్రం ప్రస్తుత వెర్షన్ మాదిరిగానే ఉండనుంది. అనేక అదనపు ఫీచర్లను కూడా తీసుకువచ్చారు. వాటిలో టెయిల్ గేట్ పై అడాస్ బ్యాడ్జీ, ముందు విండ్ షీల్డ్ పై రాడారా మాడ్యూల్, లేన్ కీప్ అసిస్ట్, అడాప్టివ్ క్రూయిజ్ కంట్రోల్, ఆటోమేటిక్ ఎమర్జెన్సీ బ్రేకింగ్ ఆకట్టుకుంటున్నాయి.

ఇప్పటికే విండ్సర్ ఈవీ 38 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీతో అందుబాటులో ఉంది. పూర్తి స్థాయి సింగిల్ చార్జింగ్ పై సుమారు 332 కిలోమీటర్ల రేంజ్ ఇస్తోంది.

### వోక్స్ వ్యాగన్ గోల్ఫ్ జీటీఐ

జర్మన్ తయారీ సంస్థ అయిన వోక్స్ వ్యాగన్ నుంచి గోల్ఫ్ జీటీఐ కారు మే నెలలో విడుదల కానుంది. దేశంలోని ప్రధాన నగరాల్లో కారు బుక్కింగ్ లు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. ఈ కారు నాలుగు ఆకట్టుకునే రంగుల్లో అందుబాటులోకి రానుంది. దీనిలోని 2 లీటర్ల టర్బో పెట్రోలు ఇంజిన్ నుంచి 265 పీఎస్ శక్తి, 370 ఎన్ ఎం టార్కు విడుదలవుతుంది. కేవలం 5.9 సెకన్ల లో సున్నా నుంచి వంద కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. 7 స్పీడ్ డ్యూయల్ క్లచ్ ఆటోమేటిక్ గేర్ బాక్స్ కు జత చేశారు.

### టాటా ఆల్ట్రోజ్ ఫేస్ లిఫ్ట్

నవీకరించిన టాటా ఆల్ట్రోజ్ 2025 కారును మే నెలలో విడుదల చేయనున్నారు. 2020లో విడుదలైన కారుకు ఇది ఫేస్ లిఫ్ట్ అని చెప్పవచ్చు. ఈ ప్రీమియం హచ్ బ్యాక్ కారు అమ్మకాలు కొన్నేళ్లుగా జోరుగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఫేస్ లిఫ్ట్ ను అదిరే లుక్ తో తీసుకువచ్చారు. ఆధునిక హెడ్ ల్యాంపులు, ఫ్లష్ టైప్ డోర్ హ్యాండిళ్లు, కొత్త 3 డీ స్టైల్ రేడియేటర్ గ్రిల్, టెయిల్ ల్యాంపులు బాగున్నాయి. లోపల టాటా లోగోతో రెండు స్పోక్ స్టీరింగ్ వీల్, కొత్త ఇంటర్ ఫేస్ తో కూడిన టచ్ స్క్రీన్, డాష్ బోర్డు, ఏసీ నియంత్రణ, సెంటర్ కన్సోల్ ఆకర్షణీయంగా ఉన్నాయి.

1.2 లీటర్ నేచురల్లీ ఆస్పిరేటెడ్ పెట్రోలు, 1.2 లీటర్ టర్బో పెట్రోల్, 1.5 లీటర్ డీజిల్ ఇంజిన్ల ఎంపికతో పాటు, ట్విన్ సిలిండర్ లేఅవుట్ తో సీఎన్జీ వేరియంట్ అందుబాటులోకి రానుంది. ట్రాన్స్ మిషన్ ఎంపికలలో వేరియంట్ ను బట్టి 5 స్పీడ్ మాన్యువల్, 6 స్పీడ్ డీసీటీ ఉంటాయి.

## ఉత్పత్తిలో ఆ ప్రభుత్వ కంపెనీ రికార్డు

**ఏకంగా 15 శాతం పెరుగుదల**




**న్యూఢిల్లీ:** ప్రభుత్వ యాజమాన్యంలోని ఎన్ఎండీసీ ఏప్రిల్‌లో ఇనుప ఖనిజం ఉత్పత్తిలో 15 శాతం పెరుగుదల, ఖనిజ అమ్మకాల్లో 3 శాతం వృద్ధిని నమోదు చేసినట్లు నివేదించింది. ఇటీవల విడుదల చేసిన ఒక ప్రకటనలో ఎన్ఎండీసీ ఏప్రిల్‌లో 4 మిలియన్ టన్నుల (ఎంఎన్‌టీ) ఇనుప ఖనిజాన్ని ఉత్పత్తి చేసిందని , గత ఏడాది ఇదే నెలలో ఇది 3.48 ఎంఎన్‌టీ గా ఉందని తెలిపింది. ఎన్ఎండీసీ గత నెలలో 3.63 ఎంఎన్‌టీ ఇనుప ఖనిజాన్ని విక్రయించింది. ఇది ఏప్రిల్ 2024లో 3.53 ఎంఎన్‌టీగా ఉంది. ఈ కొత్త రికార్డులపై ఎన్ఎండీసీ సీఎండీ అమితవ ముఖర్జీ మాట్లాడుతూ ఏప్రిల్‌లో రికార్డు స్థాయి పనితీరుతో ప్రధాన ఇనుప ఖనిజ గనులైన కిరండుల్, బచేలి, దోనిమలై ద్వారా వరుసగా 12 శాతం, 4 శాతం, 88 శాతం వృద్ధి సాధించామని పేర్కొన్నారు.

ముఖ్యంగా 2030 నాటికి 100 ఎంటీ మైనింగ్ కంపెనీగా మారాలనే ప్రతిష్ఠాత్మక లక్ష్యంతో పని చేస్తున్నట్లు ముఖర్జీ స్పష్టం చేశారు. ఎన్ఎండీసీ కంపెనీ పెల్లెట్ ఉత్పత్తి ఆల్ టైమ్ గరిష్ట స్థాయి 0.23 లక్షల టన్నులకు పెరిగింది. ఇది 2018 ఏప్రిల్ నెలలో నెలకొల్పిన మునుపటి రికార్డును అధిగమించింది. భారత ఉక్కు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఎన్ఎండీసీ భారతదేశంలో అతిపెద్ద ఇనుప ఖనిజం ఉత్పత్తి సంస్థగా ఉంది.



# సన్ రైజర్స్ ఔట్..

**ఆరెంజ్ ఆర్మీని దెబ్బ కొట్టిన వరుణుడు..**
**గెలిచే మ్యాచ్ వర్షార్పణం..**
**రాణించిన కమిన్స్.. ఢిల్లీకి ఊరట**
**మరో 3 మ్యాచ్‌లు ఉండగానే**
**ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించిన సన్ రైజర్స్**
**సోమవారం ఢిల్లీతో మ్యాచ్ రద్దు కావడంతో**
**కేవలం ఒక్క పాయింట్ మాత్రమే సాధించింది**
**దీంతో నాకౌట్ రేసు నుంచి వైదొలిగింది**



**హైదరాబాద్:** గతేడాది రన్నరప్ సన్ రైజర్స్ హైదరాబాద్ ఈ ఏడాది ఐపీఎల్ సీజన్ నుంచి నిష్క్రమించింది. సోమవారం ఢిల్లీ క్యాపిటల్స్ తో జరిగిన మ్యాచ్ రద్దు కావడంతో ఇరుజట్లకు ఒక్క పాయింట్ చొప్పున కేటాయించారు. దీంతో 7 పాయింట్లతో నిలిచిన సన్.. టోర్నీలో ముందుడగు వేసే అవకాశాన్ని కోల్పోయింది. టోర్నీలో ఇంకా మూడు మ్యాచ్ లు ఉన్నప్పటికీ, అవి గెలిచినా 13 పాయింట్లకే పరిమితం అవుతుంది, కాబట్టి ఈ సీజన్ లో ఆరెంజ్ ఆర్మీ ప్రస్థానం ముగిసినట్లే. రాబోయే మూడు మ్యాచ్ లను కేవలం పరువు కోసం ఆడనుంది. ఇక హైదరాబాద్ లోని ఉప్పల్ స్టేడియంలో జరిగిన మ్యాచ్ లో టాస్ ఓడి ఫస్ట్ బ్యాటింగ్ చేసిన ఢిల్లీ.. నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 133 పరుగులు చేసింది. ట్రిస్టన్ స్టబ్స్, అశుతోష్ శర్మ చెరో 41 పరుగులతో టాప్ స్కోరర్ గా నిలిచాడు. సన్ కెప్టెన్ పాట్ కమిన్స్ 3 వికెట్లతో రాణించాడు. ఢిల్లీ ఇన్నింగ్స్ ముగిశాక, ఎడతెరిపి లేని వర్షం కురవడంతో మ్యాచ్ రద్దు అయింది.

నిజానికి ఈ మ్యాచ్‌లో వర్షం కారణంగా ఢిల్లీ బతికిపోయిందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఫస్ట్ బ్యాటింగ్ చేసిన ఢిల్లీకి శుభారంభం దక్కలేదు. పవర్ ప్లేలోనే కమిన్స్ ధాటికి కరుణ్ నాయర్ డకౌట్, ఫాఫ్ డుప్లెసిస్ (3), అభిషేక్ పొరెల్ (8), కెప్టెన్ అక్షర్ పటేల్ (6) వికెట్లను కోల్పోయింది. కాసేపటికే కేఎల్ రాహుల్ (10) కూడా ఔట్ కావడంతో 29 పరుగులకే సగం వికెట్లు కోల్పోయి దయనీయ పరిస్థితుల్లో నిలిచింది. ఈ దశలో ట్రిస్టన్ స్టబ్స్ (36 బంతుల్లో 41 నాటౌట్, 4 ఫోర్లు) మెచ్యూర్ ఇన్నింగ్స్ తో ఆకట్టుకున్నాడు. తొలుత విప్రజ్ నిగమ్ (18) తో ఆరో వికెట్ కు 33 పరుగులు జోడించిన స్టబ్స్ .. అశుతోష్ శర్మ (26 బంతుల్లో 41, 2 ఫోర్లు, 3 సిక్సర్లు) తో కీలకమైన 66 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పడంతో ఢిల్లీ కోలుకుంది. అయితే ఫైర్ పవర్ తో కూడిన సన్ రైజర్స్ కు ఈ టార్గెట్ ఏమాత్రం సరిపోదనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే వర్షం రావడంతో ఓటమి నుంచి ఢిల్లీ తప్పించుకుందని విశ్లేషకులు భావిస్తున్నారు. తాజా ఫలితంతో టోర్నీ నుంచి సన్ అఫిషీయల్ గా ఔటైనట్లే..

### బరిలో ఏడు జట్లు..

వరుస పరాజయాలతో ఇప్పటికే చెన్నై సూపర్ కింగ్స్, రాజస్తాన్ రాయల్స్ ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించగా.. తాజాగా సన్ కూడా టోర్నీ నుంచి నాకౌట్ అవడంతో ఇప్పుడు బరిలో ఏడు జట్లే మిగిలాయి. ఆర్సీబీ 16, పంజాబ్ కింగ్ 15 పాయింట్లతో టాప్-2లో నిలిచాయి. ఈ ఇరుజట్లకు ఇంకా మూడు మ్యాచ్ లు మిగిలి ఉండటంలో కేవలం ఒక్క మ్యాచ్ గెలిస్తే చాలు ప్లే ఆఫ్స్ కు చేరిపోతాయి. ముంబై ఇండియన్స్ , గుజరాత్ టైటాన్స్ చెరో 14 పాయింట్లతో మూడు, నాలుగు స్థానాల్లో వరుసగా నిలిచాయి. ఇవి కూడా కనీసం మరో రెండు విజయాలు సాధిస్తే ప్లే ఆఫ్స్ పక్కా అవతుంది. జీటీ చేతిలో 4 మ్యాచ్ లు ఉండటంతో టాప్-2లో నిలవడంపై ఫోకస్ పెట్టింది. ఇక డీసీ చేతిలో 13, కేకేఆర్ 11, లక్నో సూపర్ జెయింట్స్ 10 పాయింట్లతో వరుసగా 5, 6, 7వ స్థానాల్లో నిలిచాయి. ఈ జట్లకు ఇంకా మూడు మ్యాచ్ లు మిగిలి ఉండటంతో ఆ మ్యాచ్ ల్లో విజయంపై దృష్టి సారించాయి. ఇక కేకేఆర్, లక్నో ఒక్క మ్యాచ్ లో ఓడినా దాదాపు టోర్నీ నుంచి నాకౌట్ అయిపోతాయి. డీసీ పరిస్థితి కాస్త మెరుగ్గా ఉంది. ఏదేమైనా మరో వారం రోజుల్లో ప్లే ఆఫ్స్ జట్లపై క్లారిటీ వస్తుంది.

# రబడకు లైన్ క్లియర్

**మరింత దుర్భేద్యంగా**
**గుజరాత్ పేస్ బౌలింగ్..!**



**అహ్మదాబాద్:** ఐపీఎల్ ఫ్రాంఛైజీ గుజరాత్ టైటాన్స్ అభిమానులకు గుడ్ న్యూస్. 18వ సీజన్‌లో ఆడేందుకు కగిసో రబడకు లైన్ క్లియర్ అయింది. నిషేధిత డ్రగ్ తీసుకున్నందుకు సస్పెండ్ అయిన ఈ స్పీడ్‌స్టర్ వైద్యుల పర్యవేక్షణలో చికిత్స తీసుకున్నాడు. రెండు సెషన్ల కౌన్సెలింగ్ పూర్తికావడంతో అతడిపై విధించిన నిషేధాన్ని దక్షిణాఫ్రికా బోర్డు ఎత్తేసింది. దాంతో, నిషేధం కారణంగా ఐపీఎల్‌కు దూరమైన రబడ త్వరలోనే గుజరాత్ జట్టుతో కలువనున్నాడు. ఇప్పటికే ప్రసిధ్, సిరాజ్, ఇషాంత్‌లతో పటిష్ఠంగా ఉన్న ఫాస్ట్ బౌలింగ్ యూనిట్ ఈ సఫారీ పేసర్ రాకతో మరింత దుర్భేద్యంగా మారనుంది. ఈ ఏడాది స్వదేశంలో జరిగిన ఎస్ఏ 20 లీగ్‌లో నిషేధిత డ్రగ్ తీసుకున్నట్టు రబడ ఆరోపణలు వచ్చాయి. జనవరి 21న ఎంఐ కేప్‌టౌన్, డర్బన్ సూపర్ జెయింట్స్ మ్యాచ్ తర్వాత అతడికి డోప్ టెస్టు నిర్వహించగా పాజిటివ్ వచ్చింది. అతడి రక్త నమూనాల్లో నిషేధిత డ్రగ్ ఉన్నట్టు అధికారులు గుర్తించారు. అయితే.. అప్పటికే ఐపీఎల్ 18వ సీజన్ కోసం రబడ భారత్‌కు వచ్చేశాడు. రెండు మ్యాచులు కూడా ఆడాడు.

కానీ, డోప్ టెస్టులో పట్టుబడిన అతడిని స్వదేశం రావాల్సిందిగా దక్షిణాఫ్రికాకు చెందిన డ్రగ్ ఫ్రీ స్పోర్ట్స్ ఆదేశించింది. దాంతో, సొంత గడ్డకు వెళ్లిన ఈ స్పీడ్‌గన్ అక్కడ చికిత్సతో పాటు.. రెండు సెషన్లు కౌన్సెలింగ్ తీసుకున్నాడు. అందుకని.. అతడిపై విధించిన తాత్కాలిక నిషేధాన్ని బోర్డు ఎత్తేసింది. సో.. ఈ స్పీడ్‌స్టర్ గుజరాత్ జట్టు తదుపరి మ్యాచ్‌ల్లో ఆడేందుకు సిద్ధమవుతున్నాడు. 10 మ్యాచుల్లో 7 విజయాలతో టాప్ -4లో నిలిచిన శుభ్‌మన్ గిల్ సేన ప్లే ఆఫ్స్ రేసులో ఉంది. మే 6న ముంబై ఇండియన్స్, మే 11న ఢిల్లీ క్యాపిటల్స్, మే 14న లక్నో సూపర్ జెయింట్స్‌తో గుజరాత్ తలపడనుంది.

# ఆ ముగ్గురు చాలా టఫ్

**నేను ఎదుర్కొన్న కష్టమైన బౌలర్లు వీళ్లే..!**

**బెంగళూరు:** ప్రపంచ క్రికెట్‌లో రికార్డుల వీరుడిగా పేరొందిన విరాట్ కోహ్లీ ఐపీఎల్ 18వ ఎడిషన్‌లో దంచికొడుతున్నాడు. వరల్డ్ క్లాస్ బౌలర్లను సైతం ఉతికేస్తూ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరును ప్లే ఆఫ్స్ దిశగా అడుగులేయిస్తున్నాడు. సమయాన్ని బట్టి గేర్ మార్చి ఆడుతున్న విరాట్ ఐపీఎల్‌లో బౌలర్లకు కొరకరాని కొయ్యగా మారాడు. అలాంటిది తనను అంతర్జాతీయ క్రికెట్‌లో భయపెట్టిన బౌలర్లు ఉన్నారంటున్నాడు కోహ్లీ. ఈ విషయాన్ని అతడు ఆర్సీబీ బోల్డ్ డైరీస్‌లో ఈమధ్యే వెల్లడించాడు.

ఐపీఎల్ 18వ సీజన్‌లో రెచ్చిపోయి ఆడుతున్న విరాట్ కోహ్లీ చిట్‌చాట్‌లో భాగంగా ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. మీరు ఎదుర్కొన్న కష్టమైన బౌలర్ ఎవరు అనే ప్రశ్నకు అతడు మూడు సమాధానాలు చెప్పాడు. అవును.. మూడు ఫార్మాట్లలో తనకు ముగ్గురు సవాల్ విసిరారని చెప్పాడీ రన్ మెషీన్. 'నా సుదీర్ఘ కెరియర్‌లో ఎందరో బౌలర్లు నాకు సవాల్ విసిరారు.

అయితే.. వాళ్లలో కొందరు మాత్రమే నన్ను చాలా ఇబ్బంది పెట్టారు. కొన్నిసార్లు భయపెట్టారు కూడా. టెస్టుల విషయానికొస్తే ఇంగ్లండ్ వెటరన్ జేమ్స్ అండర్సన్ బౌలింగ్‌ను ఎదుర్కోవడం కష్టంగా అనిపించేది. టీ20ల్లో సునీల్ నరైన్ చాలా టఫ్ బౌలర్. 15 ఏళ్లుగా అతడిని గమనిస్తున్నా. కానీ, ఇప్పటికీ అతడి బౌలింగ్ నాకు అంతుచిక్కడం లేదు. ఇక వన్డేల్లో శ్రీలంక దిగ్గజం లసిత్ మలింగ, అఫ్గనిస్థాన్ స్పిన్నర్ రషీద్ ఖాన్‌లను ఎదుర్కోవడం కష్టంగా తోచేది' అని కోహ్లీ తెలిపాడు.

### వరల్డ్ కప్ విజేతగా వీడ్కోలు



ప్రపంచంలోనే అత్యుత్తమ ఆటగాళ్లలో ఒకడైన విరాట్ కోహ్లీ నిరుడు వరల్డ్ కప్ విజేతగా పొట్టి ఫార్మాట్‌కు వీడ్కోలు పలికాడు. అయితే.. ఐపీఎల్‌లో మాత్రం కొనసాగుతున్నాడు. ఆర్సీబీకి తొలి ఐపీఎల్ టైటిల్ అందించాలనే కసితో ఆడుతున్న కోహ్లీ.. 18వ ఎడిషన్ 11 మ్యాచుల్లో 505 పరుగులు చేశాడు. ఇందులో 7 అర్ధ శతకాలు ఉన్నాయి. విరాట్‌తో పాటు టాపార్డర్, బౌలర్లు నిలకడగా రాణిస్తుండడంతో బెంగళూరు 8 విజయాలతో పాయింట్ పట్టికలో అగ్రస్థానంలో నిలిచింది.

# వన్డేలు, టీ20ల్లో టీమిండియా టాప్..

**ర్యాంకులు రిలీజ్ చేసిన ఐసీసీ**

**ముంబై:** అంతర్జాతీయ క్రికెట్ మండలి తాజా ర్యాంకులను రిలీజ్ చేసింది. వన్డేలు, టీ20ల్లో ఇండియా టాప్ ప్లేస్ కొట్టేసింది. ఇక టెస్టు ఫార్మాట్‌లో ఆస్ట్రేలియా ఫస్ట్ ప్లేస్‌లో నిలవగా, ఇండియా నాలుగో స్థానానికి పడిపోయింది. పురుషుల క్రికెట్‌కు చెందిన వార్షిక ర్యాంకింగ్స్‌ను సోమవారం ఐసీసీ రిలీజ్ చేసింది. 2024 మే నుంచి ఆడిన మ్యాచ్‌ల ఆధారంగా ర్యాంకులను వెల్లడించారు. టెస్టుల్లో ఆస్ట్రేలియా లీడింగ్‌లో ఉన్నది. టీమ్ ర్యాంకింగ్స్‌లో ఆ జట్టు టాప్ ప్లేస్ లో ఉంది. వార్షిక పాయింట్లు 15 నుంచి 13కు తగ్గినా.. పాట్ కమ్మిన్స్ నేతృత్వంలోని ఆస్ట్రేలియా 126 పాయింట్లతో అగ్రస్తానంలో నిలిచింది. బెన్ స్టోక్స్ నేతృత్వంలోని ఇంగ్లండ్ జట్టు రెండో స్థానానికి ఎగబాకింది. సౌతాఫ్రికా, ఇండియాను ఆ టీమ్ వెనక్కినెట్టింది. ఈ ఏడాది ఆడిన 4 టెస్టుల్లో ఇంగ్లండ్ మూడింటిలో విజయం సాధించింది. ఇంగ్లండ్ రేటింగ్ పాయింట్లు 113 కాగా, దక్షిణాఫ్రికా 111, ఇండియా 105 పాయింట్లతో మూడవ, నాలుగవ స్థానాల్లో ఉన్నాయి. వన్డే ర్యాంకుల్లో ఇండియా అగ్రస్థానంలో ఉన్నది. ఇటీవల ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీని భారత్ గెలుచుకున్నది. రేటింగ్‌ను 122 నుంచి 124కు



పెంచింది. చాంపియన్స్ ట్రోఫీ రన్నరప్ న్యూజిలాండ్ రెండో స్థానంలో ఉన్నది. ఇక ఆస్ట్రేలియా మూడో స్థానంలో ఉంది. టీ20ల్లో ఇండియానే వరల్డ్ చాంపియన్. ప్రస్తుతం మన జట్టు టాప్‌లో ఉన్నది. రెండో స్థానంలో ఉన్న ఆస్ట్రేలియా కన్నా 9 పాయింట్లు ఆధిక్యంలో భారత్ ఉన్నది. ఇంగ్లండ్, న్యూజిలాండ్, వెస్టిండీస్ జట్లు ఆ తర్వాత ర్యాంకుల్లో ఉన్నాయి.




## హరిహర వీరమల్లు షూటింగ్ బిజీలో పవన్ కళ్యాణ్

**టాకీస్:** 'హరి హర వీరమల్లు'ను ముగించేందుకు కథానాయకుడు పవన్ కల్యాణ్ రంగంలోకి దిగారు. ఆయన టైటిల్ పాత్రలో నటిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రం ఇప్పటికే ముగింపు దశకు చేరుకోగా.. ఆఖరి షెడ్యూల్ కోసం పవన్ ఆదివారం సెట్లోకి అడుగు పెట్టారు. హైదరాబాద్‌లో ప్రత్యేకంగా సిద్ధం చేసిన సెట్లో దర్శకుడు జ్యోతికృష్ణ నేతృత్వంలో రెండు రోజుల పాటు– ఈ చిత్రీకరణ కొనసాగనుంది. దీనిలో భాగంగా పవన్‌పై కీలక సన్నివేశాలు చిత్రీకరించి.. 6వ తేదీతో సినిమాకి గుమ్మడికాయ కొట్టనున్నారు. ఆ వెంటనే చిత్రబృందం కొత్త విడుదల తేదీని అధికారికంగా ప్రకటించనుంది. 17వ శతాబ్దం నాటి మొఘల్ సామ్రాజ్యం నేపథ్యంలో జరిగే ఆసక్తికర కథాంశంతో రూపొందుతున్న చిత్రమిది. పవన్ ఇందులో చారిత్రక యోధుడిగా మునుపెన్నడూ చూడని శక్తిమంతమైన పాత్రలో కనువిందు చేయనున్నారు. ఈ సినిమా రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానుండగా.. తొలి భాగం 'హరి హర వీరమల్లు: పార్ట్ 1– స్వోర్డ్ వర్సెస్ స్పిరిట్' పేరుతో విడుదల కానుంది. ఇందులో నిధి అగర్వాల్ (కర ఆగశసూశ) కథానాయికగా నటిస్తుండగా.. బాబీ దేవోల్, అనుపమ్ ఖేర్, సత్యరాజ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి దర్శకత్వం: క్రిష్ జాగర్లమూడి, జ్యోతికృష్ణ, సంగీతం: ఎం.ఎం.కీరవాణి, ఛాయాగ్రహణం: మనోజ్ పరమహంస, జ్ఞానశేఖర్ వీఎస్. నిర్మాత: ఎ.దయాకర్ రావు, సమర్పణ: ఎ.ఎం.రత్నం.

## రామాయణ మూవీపై సీఎం ఫడ్నవీస్ ప్రశంసలు



**టాకీస్:** బాలీవుడ్‌లో తెరకెక్కుతున్న క్రేజీ ప్రాజెక్ట్ 'రామాయణ' సినిమాపై మహారాష్ట్ర సిఎం దేవేంద్ర ఫడ్నవీస్ ప్రశంసలు కురిపించారు. ఇది ప్రపంచంలోనే అత్యంత గొప్పది గా నిలిచే చిత్రమని కొనియాడారు. నిర్మాత నమిత్ మల్హోత్రాతో కలిసి ఓ చర్చా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. బాలీవుడ్‌లో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి నితేశ్ తివారీ దర్శకుడు. బీటౌన్ అగ్ర నిర్మాతలతో కలిసి అల్లు అరవింద్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా గ్లింప్స్‌ను వేవ్స్ సమ్మిట్‌లో ప్రదర్శించారు. ఈ సినిమా గురించి మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడనవీస్ మాట్లాడుతూ.. 'భారత్‌లో ఎన్నో గొప్ప కథలు తెరకెక్కాయి. మన కళ, నాటక రంగం, సంగీతం చాలా పురాతనమైనవి. వీటికి తాజాగా కొత్త టెక్నాలజీని జోడించాలని అనుకుంటున్నాం. రామాయణ విషయంలో ఇదే జరుగుతోంది. నేను ప్రధానితో కలిసి ఈ సినిమాకు సంబంధించిన సెట్స్‌ను సందర్శించాను. దాని క్వాలిటీ చూసి ఆశ్చర్యపోయాను. కొత్త తరానికి మనం కథలు చెప్పడానికి ఇదే సరైన మార్గం. మీరు తీస్తోన్న సినిమా ప్రపంచంలోనే అత్యుత్తమంగా ఉంటుందని నేను నమ్ముతున్నానని అన్నారు. ఇందులో రాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్ నటిస్తున్నారు. సీతగా సాయి పల్లవి, రావణుడిగా యశ్ కనిపించనున్నారు. హనుమంతుడిగా సన్నీ దేవోల్, కెకేయిగా లారా దత్తా, శూర్పణఖగా రకుల్ ప్రీత్‌సింగ్ కనిపించనున్నట్లు తెలుస్తోంది. రెండు పార్టులుగా ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. 2026 దీపావళికి మొదటి భాగం, 2027 దీపావళికి రెండో పార్ట్ విడుదల కానుంది.

# ట్రెడిషనల్ లుక్‌లో 'ఆషికా రంగనాథ్'

**Ashika Ranganath**



టాకీస్: 'అమిగోస్' మూవీతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన కన్నడ బ్యూటీ ఆషికా రంగనాథ్. తన ఫస్ట్ సినిమాతోనే మంచి గుర్తింపు తెచ్చుకుంది. అలాగే తన అందం, అభినయం తో ఆకట్టుకుంది. దీంతో వరుసగా చాను. కొట్టేసింది. కింగ్ నాగార్జున సరసన 'నా సామి రంగా' చిత్రంలో ఈ భామ, యాక్టింగ్‌కి ప్రేక్షకులు ఫిదా అయ్యారు. రీసెంట్ గా కన్నడ స్టార్ హీరో సిద్ధార్థ్ సరసన 'మిస్ యూ మూవీలోనూ మెప్పిం చింది. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ మెగాస్టార్ చిరంజీవి 'విశ్వంభర సినిమాలో నటిస్తోంది. మరోవైపు నిత్యం సోషల్ మీడియాలో ఏదే ఒక పోస్టు చేస్తూ అభిమానులతో టచ్ లోనే ఉంటోంది. తాజాగా ఈ అమ్మడు ఇ వేదికగా కొన్ని ఫొటోలు షేర్ చేసింది. అందులో ట్రెడిషనల్ లుక్లో కనిపించి తన చూపుతోనే అంతా మాట్లాడింది. ఎరుపు రంగుతో అలంక రించబడిన షీర్, గోల్డెన్ దుపట్టా, ఎంబ్రాయిడరీ బ్లౌజ్, లెహంగా, మెడల హారం,మ్యాచింగ్ ఇయర్ రింగ్స్, బ్యాంగిల్స్, జడ వేసుకుని క్యూట్ గా ఉంది. ప్రస్తుతం ఈపిక్స్ నెట్టింట తెగ వైరల్ అవు తున్నాయి.

## 'శుభం' ఓ మంచి మూవీ ఆదరించండి

### నటి సమంత ప్రేక్షకులకు విజ్ఞప్తి

**టాకీస్:** టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టి 'శు భం' చిత్రాన్ని నిర్మించిన సంగతి తెలిసిందే. ఇందులో సామ్ అతిథి పాత్ర కూడా






పోషించారు. 'సినిమా బండి' ఫేమ్ ప్రవీణ్ కంద్రేగుల దర్శకత్వం వహించిన ఈ మూవీలో హర్షిత్ రెడ్డి, గవిరెడ్డి శ్రీనివాస్, చరణ్ పెరి, శ్రియ కొంతం, శ్రావణి లక్ష్మి, షాలిని కొండేపూడి, వంశీధర్ గౌడ్ ప్రధాన పాత్రలు పోషించారు. ఇక మే 9న విడుదల కానున్న ఈ మూవీ ప్రమోషన్స్ కూడా జోరుగా చేస్తున్నారు. తన హోమ్ బ్యానర్ నుంచి రాబోతున్న ఫస్ట్ మూవీ కావడంతో సమంత కూడా చాలా యాక్టివ్‌గా ప్రమోషనల్ కార్యక్రమాలలో పాల్గొంటు–న్నారు. ఇక రీసెంట్ గా ఈ మూవీకి సంబంధించి వైజాగ్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్ గ్రాండ్‌గా జరిగింది. సమంతతో సహా సినిమాలో నటించిన నటీనటులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సామ్ మాట్లాడుతూ.. వైజాగ్ లో ఈవెంట్స్ జరుపుకున్న తన సినిమాలు అన్నీ గుర్తు చేసుకుంది. ఇక్కడ ఈవెంట్ చేసిన ప్రతి సినిమా మంచి విజయం సాధించాయి, 'శుభం' చిత్రాన్ని కూడా ఆదరిస్తారని కోరుకుంటున్నట్లు చెప్పుకొచ్చింది. మూవీ చూశాక అందరు కూడా చిరు నవ్వుతోనే బయటకు వస్తారని పేర్కొన్నారు. అలాగే దాదాపు ఈ మూవీలో చాలా వరకు కొత్త వారినే తీసుకున్నారు. దీంతో ప్రతి ఒక్క ఈ మూవీ గురించి వారి అనుభూతిని పంచుకున్నారు. ఈ సందర్భంగా హీరో హర్షిత్ రెడ్డి మాట్లాడుతూ.. ' రాజ్ అండ్ డీకే కారణంగానే ఈ సినిమాలో నటించే అవకాశం దక్కింది. స్టోరీ చెప్పినప్పుడే పడి పడి నవ్వుకున్నాను, హారర్ కామెడీని ఇలా కూడా తియ్యొచ్చా అనుకున్నాను. అండ్ సమంత మామ్ ఐ లవ్ యూ.. మీరు బాగా సపోర్ట్ చేశారు' అని చెప్పగా.. సామ్ నవ్వేసింది. ప్రజంట్ ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది.



## నానితో నటించడానికి నో చెప్పిన రష్మిక

టాకీస్: హీరోల కెరీర్ విషయంలో ఎప్పుడు ఏం జరుగుతుందో ఎవరూ చెప్పలేరు. దానికి బిగ్ ఎగ్జాంపుల్ హీరో నాని.. ముందు అసిస్టెంట్ డైరెక్టర్ గా వర్క్ చేసి 'అష్టాచమ్మా' సినిమాతో తెలుగు ఇండస్ట్రీ లో హీరోగా ఎంట్రీ ఇచ్చారు. కానీ నాని హీరోగా ట్రై చేస్తున్నా సమయంలో చాలా అవమానాలు ఎదుర్కొన్నారట . నువ్వు ఇండస్ట్రీకి సెట్ కావు.. నీ ఫేస్ కి అంత సీన్ లేదు ..ఇలా రకరకాలుగా మాట్లాడారట. అంతేకాదు నాని ఇండస్ట్రీలో హీరోగా సెటిల్ అయ్యి, హిట్స్ కొట్టిన తర్వాత కూడా చాలామంది హీరోయిన్లు ఆయన తో నటించాడిని నిరాకరించారట. ఇక ఓ హీరోయిన్ అయితే నానికి ఏకంగా మూడు సార్లు రిజెక్ట్ చేసిందట. ఇంతకి ఆ హీరోయిన్ మరెవరో కాదు..రష్మిక మందన్నా. హా.. నేషనల్ క్రష్ గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న రష్మిక నాని తో మూడుసార్లు సినిమా చేసే అవకాశం దక్కించుకుందట. కానీ మూడు సార్లు ఆమె ఆ సినిమా రిజెక్ట్ చేసిందట. ఇందులో ఎంత వరకు నిజం ఉందో తెలియదు కానీ, సోషల్ మీడియాలో ఈ న్యూస్ బాగా వైరల్ అవుతోంది. ఇప్పుడు కనుక చూసుకుంటే నాని రష్మికకు మించిన స్థాయిలోనే క్రేజీ ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకున్నాడు. రీసెంట్‌గా 'హిట్ 3' మూవీతో నాని పేరు ఇండస్ట్రీలో మారుమ్రోగిపోతుంది. ఇది అందరికి సాధ్యం కాదు. కానీ నాని తన ట్యాలెంట్ తో సాదించుకున్నాడు. ఇప్పుడు నాని తో మూవీ అంటే ఏ హీరోయిన్ రిజక్ట్ చేసే ఛాన్స్ కూడా లేదు.

## బన్నీ-అట్లీ సినిమాపై పెరుగుతున్న అంచనాలు



టాకీస్: పాన్ ఇండియా లెవెల్ లో తెలుగు హీరోలు తీస్తున్న సినిమాలు చిత్రసీమను షేక్ చేస్తున్నాయి. హాలీవుడ్ లెవెల్ యాక్షన్ హంగులు ఉన్న భారీ సెట్టింగ్స్, ఇలా ఎన్నెన్నో సినిమాలు ఇండియన్ సినిమా దగ్గర నుంచి వస్తున్నాయి. ఇక అలా ఇండియన్ సినిమా నుంచి రీసెంట్‌గా ఇంటర్నేషనల్ లెవెల్లో అనౌన్స్ అయిన సినిమా ఏదైనా ఉంది అంటే.. అది ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, అట్లీ కాంబి నేషన్‌లో వస్తున్న మూవీ అని చెప్పవచ్చు. కాగా ఈ చిత్రం అనౌన్స్ చేసినపుడే అందులో విజువల్స్ చూసి హాలీవుడ్ లెవల్లో ప్లాన్ చేస్తున్నట్టు- అర్ధం అవుతుంది. అయితే ఈ మూవీలో బన్ని మొత్తం మూడు పాత్రలు పోషించనను న్నాని తెలుస్తోంది. ఇందుకోసం చాలా కసరత్తులు చేస్తున్నాడట. ఇక ఈ సినిమాతో విజువల్ ఎఫెక్ట్స్ పరంగా ఆడియెన్స్‌ని ఖచ్చితంగా మరో లోకం లోకి తీసుకెళ్ళడానికి బన్నీ ఇంకా అట్లీ- ఇద్దరు గట్టిగా ప్లాన్ చేస్తున్నారట. ఇదిలా ఉంటే ఈ రెంజ్ మూవీ కోసం యాక్టర్స్‌ని ఎంచుకోవడం ఒక్కింత కష్టం అనే చెప్పాలి. ఎందుకంటే ప్రతి ఒక్క పాత్ర చాలా ముఖ్యం. అందుకే ఇప్పటిక వరకు ఈ మూవీలో నటనటు-ల గురించి ఎలాంటి అప్ డేట్‌లు రావడంలేదు. కానీ తాజాగా ఈ సినిమాలో ఓ స్పెషల్ రోల్‌ను డిజైన్ చేస్తున్నట్లు- తెలుస్తోంది. ఈ పాత్రలో ఓ బాలీవుడ్ హీరోని తీసుకునే ఆలోచనలో మూవీ టీ-ం ఉన్నట్లు- సమాచారం. మరి ఆ హీరో ఎవరు అనేది చూడాలి. ప్రజంట్ టాలీవుడ్ బారీ చిత్రాల్లో ఒక్కరైనా బాలీవుడ్ యాక్టర్స్ కచ్చితంగా ఉంటున్నారు.




## ఊరమాస్ లుక్‌లో సుహాస్

టాకీస్: నటుడు సుహాస్ ఈ నడుమ మంచి కంటెంట్ ఉన్న సినిమాలను ఎంచుకుంటున్నాడు. తాజాగా ఆయన నటిస్తున్న మూవీ మండాడి. కోలీవుడ్ నటుడు సూరితో కలిసి ఈ సినిమా చేస్తున్నాడు. తమిళ డైరెక్టర్ మతిమారన్ ఈ మూవీని తెరకెక్కిస్తున్నాడు. తాజాగా మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఇందులో సుహాస్ ఊరమాస్ లుక్ లో వైల్డ్ గా కనిపిస్తున్నాడు. గడ్డం, పొడవాటి జుట్టు-తో రగ్డ్ లుక్ లో ఉన్నాడు. పైగా టీ-షర్టు, లుంగీలో కనిపిస్తున్నాడు. ఇది విలేజ్ స్పోర్ట్స్ బ్యాక్ డ్రాప్ లో వస్తున్నట్టు- తెలుస్తోంది. టీ-షర్టు మీద టీ- సునామి రైడర్స్ అని రాసి ఉంది. ఇదేదో కబడ్డి ఆట నేపథ్యంలో సాగుతున్నట్టు- ఉంది. ఇంకో పోస్టర్ లో సూరి, సుహాస్ సముద్రంపై పడవల్లో సీరియస్ లుక్ లో కనిపిస్తున్నారు. ఈ రెండు లుక్స్ ఇప్పుడు చర్చీనీయాంశం అవుతున్నాయి. సుహాస్ ఇలాంటి సీరియస్ లుక్ లో ఇప్పటి వరకు కనిపించలేదు. ఇంత రగ్డ్ లుక్‌తో కనిపిస్తుండటంతో ఈ మూవీపై ఒక్కసారిగా హైప్ పెరుగుతోంది. ఇప్పటి వరకు ఈ సినిమా గురించి టాలీవుడ్ లో పెద్దగా తెలియదు. కానీ ఈ ఒక్క పోస్టర్ తోనే టాలీవుడ్ అ-టె-న్షన్ మొత్తం తనవైపు మళ్లించుకున్నాడు సుహాస్. మంచి కథలు ఎంచుకునే ఈ హీరో.. ఈ మండాడిలో ఇంకెలా ఉంటాడో అని అంతా వెయిట్ చేస్తున్నారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.